కరీంనగర్ సూర్య
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల
శుక్రవారం 12 జనవరి 2024 14పేజీలు



# వైభవంగా మహాశివరాత్రి జాతర

- భక్తులకు మెరుగైన సౌఖ్యాలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సూర్య, వేములవాడ (2లో)

# భగీరథతో రహదారులు ధ్వంసం

- భగీరథ తవ్వకాలతో రహదారులు, పైప్ లైన్లు ధ్వంసం
- ప్రమాదల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

**సూర్య, మెట్‌పల్లి**

పట్టణ పరిధిలో చేపట్టిన మిషన్ భగీరథ పనులతో అంతర్గత రహదారులు ధ్వంసం అయి ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మిషన్ భగీరథ పనులతో కోట్లు వెచ్చించి నిర్మాణం చేపట్టిన రహదారులు, మురుగు కాలువలు, తాగు నీటి పైప్ లైన్‌లు పనికి రాకుండా పోతున్నాయి. మిషన్ భగీరథతో ధ్వంసం పట్టణంలో గత ఏడాది అధికారులు ఇంద్రనగర్, చైతన్య నగర్, దుబ్బవాడ, రాంనగర్ (మిగతా 2లో)



# కాళేశ్వరంపై విచారణ ఏది?

- జ్యుడిషియల్ విచారణను మేడిగడ్డకే పరిమితం చేస్తారా?
- కాంగ్రెస్ ద్వంద్వ విధానానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?
- రాష్ట్ర ప్రభుత్వం కోరితే సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం (మిగతా 2లో)






# "పందెం కోడి" బహిరంగ వేలం



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ బస్టాండ్‌లో పందెం కోడిని ఆర్టీసీ అధికారులు బహిరంగ వేలం వేయబోతున్నరు. వివరాల్లోకి వెళితే ఇటీవల బస్సులో మరిచిపోయిన పందెం కోడిని మూడు రోజులుగా తీసుకపోవడానికి ఎవరూ రాలేదు. కావున అట్టి పందెంకోడినీ అంబేద్కర్ బస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించబడుననీ ఆర్టీసీ అధికా రులు తెలిపారు. కావున ఆసక్తిగలవారు బహిరంగ వేలంలో పాల్గొనలని కోరారు.

# జగిత్యాలలో ట్రా"ఫికర్"

- బ్యాంకుల ఎదుట అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందుల్లో ప్రజలు



సూర్య జగిత్యాల 2లో

# "హోం"గార్డ్ కష్టాలు

- సమయానికిరాని వేతనాలు
- సమయపాలన లేకుండా డ్యూటీలు
- గుర్తింపు గౌరవం లేక మనోవేదనపడుతున్న హెూంగార్డులు



**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

తెలంగాణాలో హెూంగార్డ్‌ల పరిస్థితి దయానియంగా మారింది. తెలంగాణ వస్తే తమ బతుకులు మారుతాయని ఎన్నో కలలు కన్నా వారి పరిస్థితి కలగానే మిగిలిపోతుంది. ప్రతినెలా సమయానికి జీతాలు రాకా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ప్రతి నెల జీతాలలో జాప్యంతో ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు, బ్యాంకు emiలు సకాలంలో చెల్లించకపోవడంతో అవమానాలు పడుతున్నామని హెూం గార్డుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి జీతాలు రాకపోయినా సమయపాలన లేకుండా హెూం గార్డులు తమ విధులను నిర్వహిస్తున్నారు. కానిస్టేబుల్‌తో సమానంగా డ్యూటీలు (మిగతా 2లో)

# భగీరథతో రహదారులు ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

లతో పాటు మరి కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆయా కాలనీలలో మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం ఇస్టారితిన తవ్వకాలు చేపట్టడంతో రహదారులు, మురుగు కాలువలు, తాగు నీటి పైప్ లైన్ లు ధ్వంసం జరిగి అవి పనికి రాకుండా పోయాయి. దింతో ఆయా కాలనీలలో రహదారులు, సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే మురుగు కాలువలు ధ్వంసం అయి మురుగు నీరు ఇళ్లలోకి, రహదారుల పైనే ప్రవహిస్తూ తీవ్ర దుర్గంధం నెలకొంటుంది. స్వంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్న తాగు నీటి పైపు లైన్ ధ్వంసం తో రోజు తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి కానీ ప్రధాన పైపు లైన్ పనులు పట్టణ పరిధిలో మిషన్ భగీరథ కు సంబంధించి ప్రధాన పైప్ లైన్ పూర్తి కావాల్సి ఉంది. అలాగే అన్నీ కాలనీలా పరిధిలో ఏనాబై కిలోమీటర్ల పైప్ లైన్ నిర్మాణం జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం యాభై శాతం మాత్రమే పైప్ లైన్ నిర్మాణం జరిగినట్లు తెలిసింది. ఇక భగీరథ నిర్మాణ పనులతో ధ్వంసం ఆయిన రహదారులు, మురుగు కాలువలు, తాగు నీటి పైప్ లైన్ మరమత్తుల విషయమై మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేయగా వాటికి తమకు ఎలాంటి సంబంధం లేదంటూ వారు తెలపడం కాలనీ వాసులను బాధిస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్, భగీరథ అధికారులు స్పందించి ధ్వంసం అయిన రహదారులు, మురుగు కాలువల తో పాటు తాగు నీటి పైపు లైన్ మరమ్మత్తులు చేపట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

**ధ్వంసం ఆయిన రహదారులు మరమ్మత్తులు చేయండి**

**జి. మారుతి -ఇంద్రనగర్ -మెట్ పల్లి**



మాల సంఘం ఎదురుగా చేపట్టిన భగీరథ పనులతో రహదారులు, తాగు నీటి పైపులు ధ్వంసం జరిగింది. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలి.

**ధ్వంసం ఆయిన వాటిని పరిశీలిస్తాం**

**జగదీశ్వర్ గౌడ్ -మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్**



భగీరథ పనులతో ధ్వంసం ఆయిన రహదారులు, మురుగు కాలువలు నిబంధనల ప్రకారం ఆయా అధికారులు మరమ్మత్తులు చేపట్టాలి. ఆయిన తమ ద్రుష్టి కి తెస్తే పరిశీలించి చర్యలు చేపడతాం.

# కాళేశ్వరంపై విచారణ ఏది?

(మొదటి పేజీ తరువాయి)

శాఖ ఆధ్వర్యంలో గురువారం గీతాభవన్ చౌరస్తా నుండి ఎస్సారార్ కళాశాల వరకు నిర్వహించిన 3 కే రన్ కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ పూర్వ విద్యార్థిగా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 3కే రన్ పాల్గొనడం ఆనందంగా ఉంది. స్వామి వివేకానంద చరిత్ర, ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడిందని చెప్పిన కాంగ్రెస్ నేతలు%ాా% నేడు అందుకు భిన్నంగా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంపైనే జ్యుడీషియల్ విచారణ కోరడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతిని కాపాడేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కోరితే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరించేందుకు తాము సిద్ధమన్నారు. అయోధ్యలో రామ మందిర పున: ప్రతిష్ట కార్యక్రమాన్ని కాంగ్రెస్ బహిష్కరించడం విడ్డూరమన్నారు. ఇది బీజేపీ కార్యక్రమం కానేకాదని, పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి భారతీయుడు పాల్గొనే మహత్తరమైన కార్యక్రమమన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణంపై కాంగ్రెస్ విధానామేంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అయోధ్య రామయ్య అందరికీ దేవుడు. ప్రతి భారతీయుడు రాముడి విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. రామ మందిర నిర్మాణం బీజేపీకి సంబంధించిన కార్యక్రమం కానేకాదు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ మహత్తర కార్యక్రమంలో పాల్గొనాలి. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ అగ్రనేతలు బహిష్కరించడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు.

## నిర్ణీత వ్యవధిలో ఆర్వోబీ పనులను పూర్తి చేయాలి

**- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి,ఎంపీ బండి సంజయ్ కుమార్**

**- ఆర్వోబీ పనుల తీరుపై బండి ఆగ్రహం**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



నిర్ణీత వ్యవధిలో ఆర్వోబీ పనులను పూర్తి చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులను,కరీంనగర్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను పరిశీలించారు. పనుల తీరుపై ఆరా తీశారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్న అధికారులు మార్చి రెండో వారానికల్లా పనులు పూర్తవుతాయని, నెలాఖరు నాటికి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.తీగలగుట్టపల్లిలో రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) లేకపోవడంవల్ల ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బంది పడ్డారు. ఆర్వోబీ నిర్మాణం విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ మాత్రం సహకరించలేదు. నిధుల మంజూరులోనూ జాప్యం చేసింది. కేంద్రం నిధులు విడుదల చేసినా రాష్ట్రం వాటా ఇవ్వకుండా సతాయించారు. చివరకు సేతు బంధన్ పథకం కింద 100 శాతం నిధులను (రూ.154 కోట్లు) కేంద్రమే మంజూరు చేసింది. భూసేకరణ బాధ్యత మాత్రం రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు.అయినా ఇప్పటి వరకు భూసేకరణ చేయకుండా జాప్యం చేస్తున్నారు. ఇన్నాళ్లు మాట్లాడకుండా ఇప్పుడు భూసేకరణ సమస్య ఉందని అధికారులు చెబుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని కోరుతున్నానని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడాదిలోపు ఆర్వోబీ పనులను పూర్తి చేయాల్సిందేనని... పనులు సరిగా చేయకపోతే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండని... ఈ పనులకు పూర్తి జవాబుదారీ అధికారులదేననే విషయాన్ని గుర్తుంచుకుని పని చేయాలని తెలిపారు.







పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యాసంస్థలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో - రంగవల్లుల పోటీలను నిర్వహించగా విద్యార్థులు పోటీ పడుతూ ముగ్గులు వేశారు. విద్యార్థులు రంగురంగుల సాంప్రదాయ దుస్తులతో పాఠశాల ఆవరణలో ప్రదర్శనలు చేయగా పండుగ వాతావరణం నెలకొంది. హరిదాసు కీర్తనలు, గంగిరెద్దు విన్యాసాలు, గాలిపటాల ఆటలు ఆకట్టుకున్నాయి.



**సూర్య పెద్దపల్లి**

## వైభవంగా మహాశివరాత్రి జాతర

**- భక్తులకు మెరుగైన సౌఖర్యాలు**

**- సమీక్ష లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**సూర్య వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి జాతర వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అధికారులతో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం సాయంత్రం చైర్మన్ ఛాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాబోవు మహాశివరాత్రి జాతర సందర్భంగా చేస్తున్న ఏర్పాట్ల పై పలు సూచనలు చేశారు. సమ్మక్క సారలమ్మ ను దర్శించుకునే ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీలో భాగంగా వస్తుందని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఆది, సోమ, శుక్రవారాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో ట్రా"ఫికర్"

**సూర్య జగిత్యాల**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు బ్యాంకుల ఎదుట వాహనాలు అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తున్నారు. కొందరు వినియోగధారులు నడి రోడ్డుపై కార్లను పార్కింగ్ చేసి బ్యాంకు లావాదేవీలు ముగిసే వరకు అలాగే నిలిపి ఉంచుతున్నారు. దీంతో అటువైపు నుండి వెళ్లే వాహన చోధకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటు న్నారు. జగిత్యాల పట్టణంలోని కొత్త బస్ స్టాండ్ చౌరస్తా సమీపంలో గల బ్యాంకుల ఎదుట నిత్యం ద్విచక్ర వాహనాలు నిలిచి ఉంటున్నాయి. కార్లలో బ్యాంకుకు వచ్చే వినియోగదారులు అనువైన పార్కింగ్ స్థలంలో కాకుండా రోడ్డు పైనే తమ కార్లను పార్కింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్ నుండి జగిత్యాల కొత్త బస్ స్టాండ్ కు వచ్చే ఆర్టీసీ బస్ లు, ట్రాన్స్ పోర్ట్ లారీలు, ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లలేక ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. తహసీల్ చౌరస్తా నుండి టవర్ వైపుకు వెళ్లే దారిలో మరో బ్యాంకు ఎదుట, పక్కనే ఉన్న షాపింగ్ మాల్ ఎదుట ద్విచక్ర వాహనాలను నడి రోడ్డు వరకు పార్కింగ్ చేస్తున్నారు. ఆర్ డి వో కార్యాలయం ఎదుట గల బ్యాంకు ఎదుట కూడా రోడ్డును ఆక్రమించి వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి బ్యాంకుల ఎదుట వాహనాలు అస్తవ్యస్తంగా నిలుపకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## 'హోం'గార్డ్ కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నప్పటికీ తమకు సరైన గుర్తింపు గౌరవం లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18000 మంది హోంగార్డ్లు శాంతిభద్రతలు,ట్రాఫిక్,డ్రైవర్ లు గా విస్తృత సేవలు అందిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గతంలో అసెంబ్లీ సాక్షిగా హోంగార్డులను రెగ్యూలరైజేషన్ చేస్తామని ప్రకటించిన ఆదిశగా తమ సమస్యల గురించి ఏనాడు ఆలోచించలేదని అంటున్నారు. తెలంగాణ వస్తే తమ సమస్యలు తీరుతాయని ఎన్నో కళలు కన్నా హోంగార్డ్ లకు ఇప్పటివరకు ఉద్యోగ భద్రత ,ఆరోగ్య భద్రత లను గత ప్రభుత్వం ,ప్రస్తుత ప్రభుత్వాలు కల్పించలేకపోతునాయి.గతంలో జీతాల కోసం అధికారులను అడిగితే వేధించడంతో ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఇప్పటికయినా తమ సమస్యలు పరిష్కరించాలని హోంగార్డులు వేడుకొంటున్నారు.

పండగపూట పస్తులేనా...

వేతనాలు సకాలంలో అందకపోవడంతో హోంగార్డుల కుటుంబ సభ్యులు పండగపూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉంది.12 వ తేదీ వచ్చిన ఇంకా జీతాలు రాకపోవడంతో సంక్రాంతి పర్వదినాన కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోలేకపోతున్నామని, కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇకనుండి అయినా ప్రతినెల నెల సకాలంలో తమకు జీతాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

## సమగ్ర సమాచారంతో కూడిన నివేదికలను తయారు చేయాలి

**- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో నివేదికలు తయారు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల వివరాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు సంబంధించి ప్రస్తుత స్థితిగతులు, పురోగతిలో, పెండింగ్ లో ఉన్న పనుల వివరాలు, జిల్లాలో చేపట్టవలసిన



కార్యక్రమాల ఇతర అంశాలతో కూడిన నివేదికను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, వైద్యం, గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, పౌర సరఫరాల శాఖ, మూడు మున్సిపాలిటీలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్య, రోడ్లు భవనాల శాఖ లలో చేపట్టిన వివరాలను క్రోడీకరించి నివేదిక ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు హనుమా నాయక్, సి.హెచ్. మధు మోహన్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నెలకొన్నాయి. గురువారం కోరా జాన్సన్ విద్యార్థులు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు,చిన్నారులకి భోగిపండ్లు పోసి, విద్యార్థులు వివిధ రకాల రంగవల్లులు వేసారు. విద్యార్థులు గాలి పటాలు ఎగురవేశారు. అనంతరం పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోష్ రెడ్డిలు సంక్రాంతి సంబరాలు ఆరంభించారు. ముందుగా భోగిమంటలు వెలిగించి చిన్నారుల రంగవల్లులను వీక్షించి అందులో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో బాగంగా డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి పండుగా వాతావరణం మా కోరా జాన్సన్ లో ముందుగానే నెలకొందని చిన్నారులు ఎంతో ఉత్సాహంగా రంగవల్లులు తీర్చిదిద్దారు పాఠ శాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారని చిన్నారులకి పెద్దవారు సంక్రాంతి భోగి రోజున బోగిపళ్ళు పోసి దిష్టి తీసివేస్తారని కొత్త పంటలు వచ్చాక అమ్మవారికి నైవేద్య సమ్పాస్తారని విద్యార్థులు హరిదాసు వేషధారణలో అలరించారు

**సెయింట్ జార్జ్ పాఠశాలలో...**

**సూర్య,కరీంనగర్ రూరల్**

కరీంనగర్ లోని రేకుర్తి ,విద్యానగర్ లలోని సెయింట్ జార్జ్ నిసొస్ బ్లాక్ సీబీఎస్ఈ పాఠశాలలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ డా.పి. ఫాతిమా రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ చాలా విశిష్టమైనదని సంస్కృతి సంప్రదాయాలకు నెలవని పల్లెటూరి వాతావరణం పండుగ ప్రాముఖ్యతను



పల్లెటూర్లలో కనబడుతుందన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సూర్య భగవానున్ని ఆరాధిం చినట్లు అయితే సకల శుభాలు అష్టైశ్వర్యాలు కలుగుతాయని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు హరిదాసు వేళాధారణతో సంక్రాంతి పండుగన విశిష్టతను తెలుపుతూ గొబ్బెమ్మలు చేసి, భోగిమంటలతో, గంగిరెద్దులు, మామిడి తోరణాలు, చెరుకు గడలు, సూర్యునికి నైవేద్యం చేసి కొత్త బియ్యపు పొంగలి గ్రామీణ వాతావరణం, సంక్రాంతి పండుగ సమయంలో ఒక అద్భుత దృశ్యం కనబరిచి విద్యార్తులందరికీ భోగి పండ్లు పోయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జెస్ సంగీత, సంధ్య, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

**పారమిత పాఠశాలలో...**

**సూర్య,కరీంనగర్ రూరల్**

స్థానిక మంకమ్మతోటలోని పారమితఉన్నత పాఠశాల, లిటిల్ జీనియస్, పద్మనగర్ లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి ముందస్తు సంబురాలను ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పారమిత పాఠశాలల చైర్మన్ ఈ.ప్రసాద్ రావు హాజరై జ్యోతి ప్రజ్వల వేసి కార్యక్రమాన్ని ప్రారంభి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జ్యోతిష్యశాస్త్రం, తెలుగు పంచాంగం ప్రకారం, సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి సంచారం చేసిన సమయంలోనే మకర సంక్రాంతి పండుగ ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, రస్మిత, రాకేష్, అనుకర్ రావు, వినోదరావు, హనుమంతరావు, వి.యు.యంప్రసాద్ ప్రధానోపాధ్యాయులు బాలాజీ ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయకర్తలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు,

**అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో.........**

**సూర్య,కరీంనగర్ రూరల్**

స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ ముందస్తు సంక్రాంతి వేడుకలలో భాగంగా నిర్వహించిన పొంగల్ ప్లే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తప్పనిసరిగా వివిధ క్రీడాంశాల పట్ల అవగాహన కల్పించడమే కాకుండా వాటిలో పాల్గొనలా ప్రోత్సాహకం అందించి నాణ్యతమైన శిక్షణ అందించాలని తద్వారా పాల్గొనే ప్రతి పోటీలలో విజయాన్ని చాలా సునాయాసంగా సాధించవచ్చునని తెలిపారు. విద్యార్థులకు ఫుట్బాల్, టేబుల్ టెన్నిస్, ఖో-ఖో, చెస్, క్యారమ్స్, షటిల్, వాలీబాల్, త్రోబాల్ మరియు టెన్నికాయిట్ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు త్వరలో నిర్వహించబోయే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, తల్లితండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







## శ్రీ వాగ్దేవిలో సంక్రాంతి సంబరాలు

**సూర్య గన్నేరువరం**



మండలంలోని గునుకుల కొండాపూర్ లో గల శ్రీ వాగ్దేవి పాఠశాలలో గురువారం రోజున సంక్రాంతి సంబరాలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. విద్యార్థినిలు ఎంతో అందమైన ముగ్గులు వేసి అలరించారు వారికి పాఠశాల కరస్పాండెంట్ బూట్ల శ్రీనివాస్ అభినందించి బహుమతులు ఇవ్వడం జరిగింది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేసి అందరిని అలరింప చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం వడ్లకొండ శ్రీనివాస్, నేలపట్ల శంకర్, నేలపట్ల ఎల్లయ్య, బూట్ల శ్రీరామన్, జ్యోతి,స్వప్న ,లాస్య విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీ విజేతలకు సన్మానం

**సూర్య గన్నేరువరం**



కరీంనగర్ డైరీ వారి సంక్రాంతి ముగ్గుల పోటీలలో BCUకు చెందిన బెజ్జంకి, గన్నేరువరం మండలాల గ్రామాల తరపున గునుకుల కొండాపూర్ గ్రామానికి మొదటి, రెండవ బహుమతి రావడం జరిగింది. ఈ పోటీలలో పాడి రైతు బూట్ల భాస్కర్ కుమార్తెలు మొదటి బహుమతి విజేత బూట్ల కళ్యాణి ,రెండవ బహుమతి విజేత బూట్ల కవితలను గునుకుల కొండాపూర్ పాల కేంద్రం తరపున సన్మానించినారు.వీరిలో పాలకేంద్రం చైర్మన్ జాగిరి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్లు గునుకుల ప్రభాకర్ రెడ్డి,కొరివి కొమురయ్య , పాల కేంద్రం సెక్రటరీ నేలపట్ల శంకర్ మరియు ఇతర పాడి రైతులు కొర్వి సంపత్, లింగంపల్లి కిష్టయ్య, సుధాగోని శేఖర్, నేలపట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణవేణి స్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య, చొప్పదండి**



శ్రీకృష్ణవేణి హై స్కూల్ చొప్పదండిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు వివిధ వేషధారణలతో సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు ఆటపాట కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా హరిదాసు తెలుగింటి ఆడపిల్లల వస్త్రాదరణ, పల్లెటూరి జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతలు తెలుగువారి సాంప్రదాయాలను ప్రాముఖ్యతను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లింగరావు, ప్రధానోపాధ్యాయులు శంబయ్య, ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు వాళ్ళ తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన సద్వినియోగం చేసుకోవాలి

**-బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**

**సూర్య, చొప్పదండి**

చేతివృత్తులు, కమ్మరి, కుమ్మరి వడ్రంగి,రజక, రాతిపని, ఆభరణాలు, చెప్పులు కుట్టేపని, దర్జీ, నాయి తదితర పనులు చేసే వృత్తి నిపుణులు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లక్ష నుండి మూడు లక్షల వరకు ఋణ సహాయం అందుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు.చొప్పదండి పట్టణం లో కర్ర, ఇనుము పారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన అవగాహన సమావేశంలో మాట్లాడుతూ ఆయన కులంతో కుల సర్టిఫికేట్ తో సంబంధం లేకుండా పై వృత్తి పనులు నిర్వహించే వారందరికీ ప్రతి కుటుంబం నుండి ఒక్కొక్కరికీ సహాయం అందించి ఆదుకోవడానికి మోడీ ప్రభుత్వం ఈ పథకం రూపొందించిందని తెలిపారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో శిక్షణ నిర్వహించి రోజు రూ : 500 స్టైపండ్, రూ :15,000 విలువ చేసే టూల్ కిట్ ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు ఆసక్తి ఉన్న వారు సి ఎస్ సి కేంద్రాల్లో దరఖాస్తు చేసి వివరాలు అందచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కుల సభ్యులు తాడూరి వెంకట చారి, చిలుకునూరి రామస్వామి,తాడూరి ప్రవీణ్,గోవులకొండ ప్రదీప్,తాడూరి మహేష్,చిలుకునూరి రమేష్,రాగి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## నూతన ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల చొరవ చూపాలి

**- డి.టి.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి**

**సూర్య, చొప్పదండి**

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రూపొందించిన 2024 క్యాలండర్ ను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల చొప్పదండిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల తగు చొరవ చూపాలని కోరారు. టెట్ అర్హత 2010లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చినందున 2010కు ముందు నియామకమైన ఉపాధ్యాయులందరికీ టెట్ తో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించాలని తెలిపారు. అలాగే మిగిలిన ఎస్జీటీ, తత్సమాన క్యాడర్ బదిలీలు వెంటనే చేపట్టాలని,బదిలీ అయి రిలీవ్ కానీ స్కూల్ అసిస్టెంట్ తత్సమాన క్యాడర్ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ఖాళీ అయిన పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని ఆలోపు విద్యా వాలంటీర్లను నియమించాలని కోరారు. విద్యారంగానికి రాబోయే బడ్జెట్లో 15% తగ్గకుండా నిధులు కేటాయించాలని పర్యవేక్షక పోస్టులైన ఎంఈఓ, డిప్యూటీఈవో, డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.ఎఫ్. ఆర్. ఎస్. విధానంలో హాజరు తీసుకోవడం వలన మొదటి పీరియడ్ బోధన కంటే విద్యార్థుల ఫోటో హాజరుతోనే సమయం గడిచిపోతున్నందున ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరారు.ప్రతి పాఠశాలకు స్కావెంజర్, నైట్ వాచ్మెన్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను కేటాయించి భర్తీ చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సముద్రాల అంజయ్య మండల అధ్యక్షులు జి. శ్రీనివాసరెడ్డి ప్రధాన కార్యదర్శి కె. రాజు ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్ ఆడిట్ కమిటీ కన్వీనర్ జి. వెంకటస్వామి ఉపాధ్యాయులు రబియా బాసిరి, జలీల్, పుష్పలత, శారద, నాగభూషణం, సమత, క్రిష్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## విట్స్ లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



స్థానిక వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని డిప్లొమా, బి.టెక్ విద్యార్థినులు ముగ్గుల పోటీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. విద్యార్థులు వేసిన ముగ్గులు వివిధ అంశాలను ప్రస్తావించేలా వేసి చూపరులను ఆకర్షించే విధంగా వేసి తమలో వున్నా వినూత్నమైన నైపుణ్యతను తెలియజేస్తూ సంక్రాంతి పండుగను, విశిష్టతను తమ ముగ్గుల ద్వారా తెలిపారు.విద్యార్థులు పతంగులను ఎగురవేస్తూ తమ ఉత్సాహాన్ని, ఆనందాన్ని తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.పోటీల అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు కళాశాల ఆడిషనల్ డైరెక్టర్ బి. గోవిందరావు బహుమతులను అందజేశారు. పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. మురళి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేచినేని పవన్ రావు కె. లక్ష్మణ్ , ప్రోగ్రాం ఇంచార్జి యు. మాధవి, విభాగాధిపతులు ,అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మినీ కవిత్వ సూర్యుడు అలిశెట్టి

## - ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**సూర్య జగిత్యాల**

మినీ కవిత్వంతో మెరుపులు మెరిపించి సమాజ చైతన్యం కోసం కవిత్వం రాసిన అలిశెట్టి మినీ కవిత్వ సూర్యుడని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ప్రశంసించారు. గురువారం జగిత్యాల శివసాయి రెసిడెన్సీ లో కళాశ్రీ సాహితీ వేదిక అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 31వ జయంతి వర్ధంతి వేడుకలో అలిశెట్టి పురస్కారాలను జంగం స్వయం ప్రభ, సిరిపురం వాణిశ్రీ, డాక్టర్ తిరునగరి శరత్ చంద్ర, డాక్టర్ పగిడిపెల్లి సురేందర్ లకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పురస్కారాలను ప్రదానం



చేసి మాట్లాడుతూ అలిశెట్టి తెలుగు సాహితీలోకం మర్చిపోలేని కవిగా ఆయన అభివర్ణించారు. అలతి పదాలతో అనంత అర్థాలు చెప్పి అనల్పమైన వాక్యాలతో శబ్ద శక్తిని, తన చిత్రాలతో మహా ఇతివృత్త శక్తిని అందించాడనీ అన్నారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు దావ వసంత సురేష్ మాట్లాడుతూ అక్షరాన్ని ఆయుధం చేసి తన కవిత్వాన్ని ప్రాణ వాయువుగా మార్చి నింపాలనే తపించాడనీ అన్నారు. తెలంగాణ అలిశెట్టి కవి సమ్మేళనంలో అలిశెట్టి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అలిశెట్టి తనయుడు సంగ్రా%శీ%, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అలిశెట్టి మాధవి రాజు, ఉజగిరి జమున, మద్దెల సరోజన, అయిత అనిత, మోటూరి శ్రీనివాస్, చెట్ల చంద్ర శేఖర్, బుర్ర శ్యామల గౌడ్, లక్కరాజు శ్రీలక్ష్మి, పసుల రవి కుమార్, గుండేటి బేబిరాణి, సంకోజి రాధ శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఖాదీ బోర్డులో అవినీతిపై చర్చకు సిద్ధం

**సూర్య, మెట్ పల్లి**

పట్టణంలోని ఖాదీ బోర్డు లో జరిగిన అవినీతిపై తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశం లో వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు రెండు నెలలుగా జీతాలు లేక సమ్మె నోటీసు ఇచ్చి రాజ్యాంగబద్ధంగా సమ్మె నిర్వహించరని తెలిపారు. వారికి కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు సమ్మెకు మద్దతు తెలుపుతూ వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. వారి సమస్యలపై కమిషనర్ గారిని కాలువగా మెట్ పల్లి ఖాదీ బోర్డు నుండి యాభై లక్షల ఇంటి పన్ను రావాల్సి ఉందని వాటికి నోటీసులు కూడా ఇచ్చామని అవి రాగానే జీతాలు చెల్లిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఖాదీ నుండి రావాల్సిన డబ్బులు ఎందుకు వసూలు చేయడం లేదని, ఖాదీలో పర్మిషన్ లేకుండా నిర్మించిన షాపులు ఎన్ని, వాటి ద్వారా రావలసిన ఆదాయం ఎంత ఈరోజు కార్మికులు రెండు నెలలుగా జీతాలు లేక సంక్రాంతి పండుగ సందర్భంగా జీతాలు లేక పండుగ కూడా చేసుకోలేని స్థితిలో ఉన్నారంటే ఈ దుస్థితికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. ఇలా మున్సిపల్ ఆదాయాన్ని గండి కొడుతున్న ఖాదీ వ్యవహారం మరియు అక్రమ నిర్మాణాల గురించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని ఇట్టి అక్రమ నిర్మాణాలు ఖాధీ లో జరిగిన అవినీతికి బాధ్యత వహిస్తూ ఖాదీ బోర్డు చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు గారు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మర్రి సహదేవ్, యామ రాజయ్య, రాజేశ్వర్ గౌడ్, పిప్పర రాజేష్, జక్కని కుందన్, పద్మశాలి సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేసుల సురేందర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు ఎంఏ ముఖీం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, పొట్ట ప్రేమ్, జాజాల రాజగోపాల్, గోపిడి అక్క పెల్లి, పోతు సత్యనారాయణ, బుర్ర మహేందర్ గౌడ్,రమణ, షేక్ అహ్మద్, పొట్ట రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్ రోడ్డు ను రద్దు చేయండి

### - కోరుట్ల ఆర్డిఓ కు వినతి పత్రం సమర్పించిన రైతులు

**సూర్య -కోరుట్ల**



కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ 5, 6 వార్డుల మధ్య నుండి నూతనంగా వేయనున్న బైపాస్ రోడ్డును రద్దు చేయాలని కోరుతూ గురువారం ఆ ప్రాంత రైతులు, భూ యజమానులు, ఇతర నివాస గృహాల యజమానులు కోరుట్ల ఆర్డిఓ రాజేశ్వర్ కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణం దినదినం ఎంతో అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధి చెందే ప్రాంతం నుండి బైపాస్ రోడ్డు వేయడం తో తమ భూములకు ఎంతో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాలంటే ఎవరికి ఇబ్బందులకు కలగకుండా ముందు చూపుతో వెయ్యాలని కోరారు. కోట్లాది విలువచేసే భూముల నుండి బైపాస్ రోడ్డు నిర్మిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని వారన్నారు. ఈ బైపాస్ రోడ్డు ను ప్రభుత్వం వెంటనే విరమించుకొని, కోరుట్ల పట్టణానికి ఇతర గ్రామాలకు నష్టం జరగకుండా బైపాస్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ వినతి పత్రం సమర్పించిన వారిలో గుండోజి శ్రీనివాస్ ,తిరుపతి రెడ్డి నల్ల మల్లేష్ రెడ్డి ,గంగారెడ్డి, రాఘవ రెడ్డి, మైపాల్ రెడ్డి, నర్సారెడ్డి, లక్ష్మారెడ్డి, నారాయణరెడ్డి ,రాజేశ్వర్ రెడ్డి సురేష్ , బర్ల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## సిద్ధార్థ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**సూర్య,కోరుట్ల టౌన్**



పట్టణంలోని సిద్ధార్థ గ్లోబల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం నిర్వహించారు. పండుగలలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉన్నదని పండుగ వైభవం చాలా గొప్పనైనదని పాఠశాల కరస్పాండెంట్ ఎక్కల్ దేవి బాలాజీ దామోదర్ అన్నారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సరస్వతి, శ్రీ కృష్ణుని విగ్రహాలను, హరిదాసుల, గంగిరెద్దుల వేషధారణలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పల్లెలో చాలా గొప్పగా సంస్కృతి, సాంప్రదాయాలను దృష్టిలో పెట్టుకొని వైభవోపేతంగా ఆకాశమే హద్దుగా అన్నట్టుగా సోదరభావంతో ప్రేమ ఆప్యాయతలతో చాలా ఉత్సాహంగా జరుపుకుంటారని చెప్పారు. విదేశాలలో సైతం ఈ పండుగకు చాలా ప్రాచుర్యం ఉన్నదని, మన దేశంలో అవలంభించే పండుగ విధివిదానాలను ఎటువంటి లోటులేకుండా అమలు పర్చి పండుగ వైభవాన్ని ఘనంగా నిర్వర్తిస్తారని చెప్పారు. మకర సంక్రాంతి కంటేముందు , తర్వాత వచ్చే రోజులుగా పరిగణించబడు భోగి , కనుమ ప్రత్యేకత చాలా ఉన్నదని ఈ పండుగలే సంక్రాంతి పండుగను పరిపూర్ణంగా చేస్తుందని అన్నారు. సమాజంలో నెలకొన్న దుష్టశక్తులను ప్రారద్రోలడానికై భోగభాగ్యాలు సిద్ధించడానికై భోగి పండుగ రోజున ప్రత్యేక పూజలు చేస్తామని భోగి మంటలతో చెడును ప్రారదోలి మంచిని ఆహ్వానిస్తూ జీవితం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటారని దామోదర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు కటుకం జగదీశ్వర్, ప్రిన్సిపాల్ కటుకం వినోద, ఉపాధ్యాయులు మరిపెల్లి నవీన్, పిస్క శిరీష, చిలువేరి రచన, సాత్పడి రవళి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగిత్యాల పట్టణంలో చోరీ

**సూర్య జగిత్యాల టౌన్**



జగిత్యాల పట్టణంలోని పురాణిపేటకు చెందిన నోముల సాగర్ ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని తన కుటుంబ సభ్యులతో గత నెల రోజుల క్రితం అమెరికాకు వెళ్ళగా తాళం వేసి వున్న ఇంటిని గమనించిన దొంగలు గడ్డపార సాయంతో ఇంటి తాళాలు పగులగొట్టి కప్ బోర్డులో ఉన్న లాకర్ లో ఉన్నఅర తులం బంగారం, 5వేల నగదు ఎత్తుకెళ్లారనీ బాధితుడు తెలిపారు. అయితే కొద్దిరోజులుగా జగిత్యాలలో వరుస చోరీలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పని నిమిత్తం తాళం వేసి బయటకు వెళ్ళాలంటేనే ప్రజలు జంకుతున్నారు.

## రోడ్డు పై మరమ్మత్తులు చేపట్టిన పోలీసులు

**సూర్య- కోరుట్ల**

కోరుట్ల పట్టణంలోని నంది చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలను కోరుట్ల ఎస్సై కిరణ్ కుమార్ వాటి కి శుక్రవారం మరమ్మతులు చేపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతల వల్ల ప్రయాణికులకు ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకే ఈ గుంతల కు మరమ్మతులు చేపట్టామని ఎస్సై తెలిపారు.






## ప్రభుత్వ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

**సూర్య, మెట్ పల్లి టౌన్**



పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల మరియు కళాశాల లను గురువారము ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ఎలాంటి సమస్య ఉన్న తన తెలియజేయాలని కోరారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ పాఠశాలలో నీటి సమస్య మరియు సిబ్బంది కొరత ఉందని ఎమ్మెల్యే కి తెలియచేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా విద్యాశాఖ అధికారితో మాట్లాడి వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి నీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అలాగె విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కళాశాల సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల తో కలిసి భోజనం చేసి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏదైనా సమస్య ఉంటే తనతో వివరించాలని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గం లో విద్యారంగానికి పెద్దపీట వేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోయిన్పల్లి చంద్రశేఖర రావు, కళాశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిషేధిత చైనా మాంజా ను ఉపయోగించవద్దు

### - జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



ప్రాణాంతకమైన నిషేధిత మాంజా ధారాన్ని ఉపయోగించకుండా సంక్రాంతి పండుగకు గాలి పటాల తో పాటు పక్షులను ఎగరనిద్దామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ప్రజాలకు సూచించారు. చైనా మాంజా తో తలెత్తే అనర్థాల పై అందరికి అవగాహన కలిగి ఉండాలని, గాలి పటాలు ఎగరడం కోసం వినియోగించే గాంజా పూత పూసిన నైలాన్, సింథటిక్ దారాలు పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని అన్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందని ఈ యొక్క చైనా మాంజా ను నిల్వచేసిన, రవాణా చేసిన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చైనా మాంజా ను ఎవరైనా తయారు చేసిన లేదా, అమ్మినా, రవాణా చేసినా సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ లకు గాని డయల్ 100 గాని ఫోన్ చేసి తెలపాలి అని సూచించారు.



## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### - అదనపు కలెక్టర్ టి ఎస్ దివాకర

**సూర్య జగిత్యాల ప్రతినిధి**

మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ఉద్యోగులు విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.ఎస్.దివాకర ఆసుపత్రి సిబ్బందిని, వైద్యులను హెచ్చరించారు. గురువారం రోజున ఆయన మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కేంద్రం పై ప్రజావాణి లో ఫిర్యాదులు రావడంతో అదనపు కలెక్టర్ సందర్శించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆయన సంభందిత పర్యవేక్షకులు రాములు నాయక్, డాక్టర్ అరుణ లను అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చే వారికి సరైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు. ఫిర్యాదు దారును కూడా పిలిపించి మాట్లాడారు. ఆసుపత్రి లోని అన్ని విభాగాల డాక్టర్లతో కూడా మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డులను సందర్శించారు.

# మండల కేంద్రంలోని ప్రభుత్వ చేతి పంపును కబ్జా చేసిన ఘనుడు

**సూర్య ముత్తారం**

ఆ చేతి పంపును చూశారా... అది గత 20 సంవత్సరాల క్రితం ప్రభుత్వం ప్రయాణికులకు దాహం తీర్చేందుకు వేశారు. అదే గ్రామానికి చెందిన ఓ ప్రబుద్ధుడి కన్ను ఇంకేముంది ఆ బోరు పై పడింది. ఏకంగా ప్రభుత్వ చేతి పంపును కబ్జా చేశాడు ఆ ఘనుడు. అది ఎక్కడో కాదు ముత్తారం మండల కేంద్రంలోని అడవి శ్రీరాంపూర్ చౌరస్తా వద్దనే. ఈ చౌరస్తా నుండి ముత్తారం మండల కేంద్రం నుంచి అటు ఓడేడు. ఇటు అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లికి. ముత్తారం గ్రామం లోపలికి. మంథని కి ప్రయాణికులు ప్రయాణం చేయాలంటే ఆ చౌరస్తా నుంచి వెళ్లాలి. ఆ చౌరస్తాలో ప్రయాణికుల కోసం ప్రభుత్వం చేతిపంపు వేసింది. ఆ చేతిపంపును మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి ప్రధాన రహదారి పక్కనే అక్కడ రెండు షటార్లు నిర్మించి, అక్కడ



ఉన్న చేతి పంపును లోపల వేసుకొని పైనుంచి రేకులు వేసి అద్దెకు ఇచ్చాడు. ఆ చేతి పంపు ప్రజలకు ప్రయాణికులకు ఉపయోగపడకుండా తాను అద్దెకిచ్చిన వారి కోసమే వాడుకుంటూ కబ్జా చేశాడు. ఈ చేతి పంపుపై పలుమార్లు అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినప్పటికీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. మంగళవారం రోజున ప్రజా పాలన దరఖాస్తుల ఆన్లైన్ పనితీరును పరిశీలించుటకై ముత్తారం వచ్చిన అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ దృష్టికి ప్రజలు తీసుకెళ్లగా ఎంపీడీవోకు, ఎంపీఓ కు అదే రోజు ఆ పైరేకులు తొలగించి చేతిపంపులు వాడుకంలోకి తీసుకురావాలని, మీరు తొలగించిన ఫోటోలను సాయంత్రం వరకు వాట్సప్ చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అయిన ఆ వ్యాపారి రాజకీయ నాయకుల అండ దండలతో చేతి పంపును కబ్జా చేసేందుకు ఇంకా ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రయాణికులకు, ప్రజలకు ఉపయోగపడేలా ఆ చేతి పంపు కు మరమ్మత్తులు చేపట్టాలని, లేనియెడల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని మండల ప్రజలు, ప్రయాణికులు అంటున్నారు.

## నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలి

**-ఆర్జీ-3 జిఎం నరేంద్ర సుధాకరరావు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగుండం-3 ఏరియాలోని గనులకు సంబంధించి భద్రత ,బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా పై ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకరరావు గురువారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గనుల అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుటకు, అలాగే నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమ వంతు కృషి చేస్తూ, లక్ష్యాలను భద్రతతో సాధించాలని, అందుకు కావలసిన చర్యలను చేపట్టాలని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలలు మాత్రమే సమయం ఉందని, అందరము కలిసి కట్టుగా పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించుకోవడానికి తగిన ప్రణాళికలను రూపొందించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పాలపర్తి ఎలీషా, ఎస్వోటు జీఎం.గుంజపడుగు రఘుపతి, ప్రాజెక్ట్ అధికారి కుర్మా రాజేందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సి. హెచ్.వెంకట రమణ, ఏరియా సర్వే అధికారి జైనులాబద్దిన్, డీ జీఎం ఐఈడీ కే.చంద్ర శేఖర్,సిహెచ్ పి డీజీఎం కాశీ విశ్వేశ్వర రావు, సివిల్ డీ జీ ఎం పద్మ రాజు, పర్సనల్ మేనేజర్ ఎం. రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఇంజనీర్ లు ఆర్.శ్రీనివాస్, ఎం.నాగరాజు, లతోపాటు వివిధ విభాగాల అధిపతులు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**సూర్య-గోదావరిఖని**



పట్టణంలోని కృష్ణవేణి విద్యా సంస్థల్లో గురువారం సంక్రాంతి పండుగ ముందస్తు సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు రంగవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల శ్రీనివాస్ రెడ్డి కి విద్యార్థులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో సంక్రాంతి ముగ్గులు, భోగిమంటలు, గొబ్బెమ్మలు, సాంప్రదాయ దుస్తులతో ఆడే కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాల ముందు రకరకాల రంగులతో ముగ్గులు వేశారు. విద్యార్థులు వేసిన రంగవల్లులను చూసిన మంజుల శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## శబరి యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ పరిధిలోని ఊషన్నపల్లి గ్రామానికి చెందిన పలువురు అయ్యప్ప స్వామి భక్తులు గురువారం శబరి యాత్రకు బయలుదేరి వెళ్లారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురు స్వామి గోనె సంజీవులు ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని బయలుదేరారు. స్వాముల ఇరుముడితో అయ్యప్ప నామస్మరణ గ్రామంలో మారుమ్రోగింది ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుండి అయ్యప్ప స్వామి నామస్మరణ భక్తి గీతాలను ఆలపిస్తూ, భజనలు చేస్తూ ఊరేగింపుగా శబరి యాత్రకు తరలి వెళ్లారు.

## జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ దేశ రత్న అవార్డు-2024 కి ఎంపిక

**సూర్య, సెంటినరీ కాలనీ**



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రముఖ అంతర్జాతీయ త్రీడీ పెయింటర్ సింగారపు శివరామకృష్ణ మరో ప్రతిష్టాత్మకమైన దేశ అవార్డుకు ఎంపికైనారు. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన దేశ రత్న అవార్డు 2024 ను ఫిబ్రవరి మాసంలో కేంద్ర మంత్రి చేతుల మీదుగా అందుకొనున్నారు. భారత్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎస్ఎస్ఆర్ కెను ఎంపిక చేస్తూ లేఖ పంపించింది. శివరామకృష్ణ ఆర్ట్ ను తిలకించిన ఉత్తర ప్రదేశ్ కు చెందిన ఎంపి జగదాంబికాపాల్ దేశంలో త్రీడీ ఆర్ట్ ఒక్క శివరామకృష్ణతోనే అభివృద్ధి చెందుతుందని కితాబునిస్తూ లేఖ వ్రాశారు. మహాభారత కాలం నాటి భారతీయ పురాతన కళ అయిన త్రీడీ ఆర్ట్ తెలిసిన వారిలో భారతదేశంలో అతి తక్కువ మంది ఉన్నారని అందులో శివరామకృష్ణ ఒకరని కితాబునిచ్చారు. ఇట్టి కళను అమెరికాలో ప్రదర్శింఇచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఎస్ఎస్ఆర్కు దక్కుతుందని, దేశంలో త్రీడీ కళ ఇతనితోనే సాధ్యమవుతుందని ఎంపి పేర్కొన్నారు. ఫిబ్రవరి మాసంలో న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్, యుపి మంత్రులు దినేష్ కార్తీక్, రఘురాజ్ సింగ్, జయప్రతాప్సింగ్, సతీష్ దివేది, ఎంపిలు మనోజ్ తివారి, సినీ ప్రముఖుల సమక్షంలో కృష్ణ దేశ రత్న అవార్డును అందుకోనున్నారు. దేశరత్న అవార్డుకు ఎంపికైన శివరామకృష్ణను కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి, తోటి అధ్యాపకులు అభినందించారు.

## విద్యార్థులకు వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత పై అవగాహన

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామంలో కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం,కృషి విజ్ఞాన కేంద్రం(రామగిరి ఖిల్లా) ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీ, బి.ఎస్.సి వ్యవసాయం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవం కార్యక్రమం చేయుటకు కేటాయించారు. అందులో భాగంగా కల్వచెర్ల గ్రామంకి ఏడుగురు విద్యార్థులకు కేటాయించారు. ఈ విద్యార్థులు 2 నెలల నుంచి రైతులకు వ్యవసాయం పై సలహాలు ఇస్తూ, అలాగే రైతులతో కలిసి పని నేర్చుకుంటున్నారు. అలాగే గురువారం రోజు గ్రామంలో చదువుతున్న విద్యార్థులు కూడా వ్యవసాయం మీద మరియు సొసైటీ మీద అవగాహన కలిపించడానికి జిల్లా పరిషత్ హైస్కూల్ లో జాతీయ సేవా పథకం లో భాగంగా విద్యార్థులకు స్వచ్ఛ భారత్, హరితహారం, వ్యవసాయం ప్రాముఖ్యతను వారికి వివరించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగాలు మీద ఆధారపడకుండా సొంతంగా వ్యవసాయం చేస్తు వ్యవసాయ రంగం ని పెంచాలని, ఫార్మర్ అని గర్వంగా చెప్పుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంటా.పద్మ వెంకటరమణ రెడ్డి,ఉప్ప సర్పంచ్ వేము కనకయ్య, మరియు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.వినోద్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వనజ, వార్డు సభ్యులు బూస బాపన్న పాల్గొన్నారు.



## ముస్లిం మైనారిటీల హర్షం

**సూర్య మంథని**



మంథని పట్టణానికి చెందిన బెంచ్ క్లర్క్ అన్వర్ హుస్సేన్ కుమారుడు మునవర్ హుస్సేన్ జూనియర్ జడ్జిగా నియమితుడైన సందర్భంగా మంథని పట్టణంలోని జమాతే ఇస్లామి హింద్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మంథని పట్టణంలోని ఉర్దూ భవన్లో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెక్రటరీ నైముద్దీన్, జిల్లా అధ్యక్షుడు ముజమిల్ హైమద్, నేతృత్వంలో జమాతే ఇస్లామి హిందు మంథని పట్టణ అధ్యక్షుడు వసీయుద్దీన్ ఉపాధ్యక్షుడు సర్దార్ ఖాన్ ప్రధాన కార్యదర్శి అఫ్జల్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మైనార్టీ నాయకులు అజీంఖాన్, అలిమ్ ఖాన్, ఇర్ఫాన్, యాకుబ్, వాజిద్ అలీ జమీల్,రియసిత్ అలీ, అలిమ్ ఖాన్, ఖలీళ్, ఖాజా తో పాటు పలువురు మునవర్ హుస్సేన్ ను అభినందించారు.

## ఫుడ్ ఫెస్టివల్, సంక్రాంతి సంబరాలు.

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలం గంగారం ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా తీసుకువచ్చిన దాదాపు 35 రకాల ఆహార పదార్థాలతో ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాల్వశ్రీరాంపూర్ మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఇలాంటి వినూత్న కార్యక్రమాలను మరెన్నో నిర్వహించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని బయటి ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యం పాలవుతామని జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముంజాల హరికృష్ణ, హై స్కూల్ ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, మహేందర్, రవి,మాధవి, పద్మ, రజిత లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య-పెద్దపల్లి రూరల్**



మండలంలోని పెద్దబొంకూర్ మదర్ తెరిసా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆనందంతో సంక్రాంతి వైభవాన్ని విశిష్టతని తెలిపే రంగురంగుల ముగ్గుల వేసి గాలిపటాలను ఎగిరివేసి ఎంతో జరుపుకున్నారు. విద్యార్థులకి ముగ్గుల పోటీలు గాలిపటాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తోడుపునూరి శ్రీనివాస్,అకౌంట్స్ ఆఫీసర్ పవన్ కుమార్, వివిధ విభాగాధిపతులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్బితం సర్పంచ్, ఉప సర్పంచ్ లను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

**- డి.పి. ఓ. చంద్రమౌళి**

**సూర్య-పెద్దపల్లి రూరల్**

సబ్బితం సర్పంచ్, ఉప సర్పంచ్ లను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బితం గ్రామ నివాసి కందుల అశోక్ చేసిన ఫిర్యాదుపై మండల పంచాయతీ అధికారి విచారణ జరిపి సమర్పించిన నివేదిక ఆధారంగా పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ సర్పంచ్ సి.హెచ్. సదయ్య, ఉప సర్పంచ్ మాదాసి శ్రీనివాస్ లు గ్రామ పంచాయతీ నిధులు 2 లక్షల 2 వేల 210 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 37 (5 ) ప్రకారం సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, అలాగే అప్పటి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బి. సతీష్, కె.శ్రీనివాస్ లకు ఛార్జ్ మెమోలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

# సంక్రాంతి పండుగకు కీడు..!!

**- వెలుగులోకి మూఢనమ్మకం.. - కంప్యూటర్ యుగంలో జోరు.. - అంతా అవాస్తవం వేద పండితులు అంబరీష్ శర్మ**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

గ్రామాలకు కీడు ఉందని లేక గ్రామంలో భూత,ప్రేత దెయ్యాలు సంచరించుతున్నాయని ఊరంతా వనభోజనాలకు వెళ్లడం, చీపిరి, చెప్పులు, చాట్లతో కొడుతూ గ్రామ శివారుకు వెళ్లి సాగనంపే తదితర అనేక రకాలుగా మూఢనమ్మకాలను తరచూ చూస్తూనే ఉంటాం. అయితే ఒక్క కుమారుడు గల మహిళ, ప్రస్తుతం ఇద్దరు కుమారులు ఉన్న మహిళలను కలిసి వారి ద్వారా తలో కొంత డబ్బులని పోగుచేసుకొని ఐదు రకాల గాజులు కొని వేసుకోవడం వల్ల కీడు పోతుందని కాల్వ శ్రీరాంపూర్ మండలంలో ఎక్కడ ఏ ఇద్దరు మహిళలు కలిసినా కొత్త మూఢనమ్మకం జోరుగా ప్రచారంలో కొనసాగుతుంది. కంప్యూటర్ కాలంలో ఒకవైపు నిత్యం టీవీ, వాట్సాప్, ఫేస్బుక్ తదితర ప్రచార మాధ్యమాలలో నిత్యం ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటున్న ప్రజలు నేటికీ సైతం మూఢనమ్మకాలను నమ్మడం ఆశ్చర్యార్థకం.

**- సంక్రాంతి పండుగకు కీడు ఉందని.**

తాజాగా సంక్రాంతి పండుగకు కీడు ఉందని మరో మూఢ నమ్మకం వెలుగులోకి వచ్చింది. సంక్రాంతి పండుగకు కీడు ఉందని, పోవాలంటే గాజులు కొని ఇవ్వాలనే ప్రచారం ముమ్మరంగా కొనసాగుతుంది. మూఢనమ్మకాలు రోజురోజుకు వస్తు, యేడాదికో సారి ఏదో ఒక రూపంలో మూఢనమ్మకాల దుష్ప్రచారాలు కొనసాగుతున్నాయి.గృహంలో కీడు ఉందని, భర్తకు, భార్యకు, అన్న తమ్ములకు,అక్క చెల్లెళ్లకు, కుమారుడు, కుమార్తెలకు కీడు ఉందని, కీడు



పోవాలంటే ఏదో ఒక రకం చర్యలు చేపట్టాలని దుష్ప్రచారం కొనసాగుతుంది.

ంవ్యాపారం ఆసరాగా.. వ్యాపారాన్ని ఆసరాగా చేసుకుని మూఢనమ్మకాలతో, దుష్ప్రచారాలతో వ్యాపారా లు పుంజుకునేందుకు మూఢనమ్మకాలు వ్యాప్తిస్తున్నాయి. ఇంట్లో సంబంధాలకు కీడు ఉందని కీడు పోవాలంటే కొత్త దుస్తులు, చీరలు, కనుములు, లుంగీ, దోవతులు, టవాలు, కుడకలు, చక్కెర, పసుపు, కుంకుమ, ఇచ్చి పుచ్చుకుంటే, వదినలకు ఆడబిడ్డలు కొత్త చీరలు కానుకగా కొని ఇవ్వాలని, తన కూతురు కుమారులకు వెండి రింగులను అమ్మమ్మలు తోడుగుతే కీడు పోతుందని గతంలో అనేక రకాలుగా మూఢనమ్మకాలు దుష్ప్రచారంలోకి వచ్చిన విషయం తెలిసిందే.

**- అంతా అవాస్తవం..**

తాజాగా సంక్రాంతి పండుగలో కీడు ఉందని పోవాలంటే ఆడబిడ్డలకు గాజులు కొని ఇస్తే పోతుందని మూఢ నమ్మకం మళ్ళీ వ్యాప్తించిది. జోరుగా మూఢనమ్మకాలు దినదినం పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా సంక్రాంతి పండుగకు కీడు వచ్చిందని ఆ కీడు దినం పోవాలంటే గాజులు కొని ఇవ్వాలంటూ జరుగుతున్న ప్రచారంపై నమ్మద్దని వేద పండితులు చెబుతున్నారు. ఇద్దరు ముగ్గురు కొడుకులు ఉన్నటువంటి తల్లులు ఒక్క కొడుకు ఉన్న తల్లికి గాజులు కొనుక్కోవడానికి డబ్బులు ఇవ్వాలంటూ వస్తున్నటువంటి ప్రచారం పూర్తిగా అవాస్తవం.మహిళా సోదరి మనులలో ఎవరికి తోచిన విధంగా వాళ్ళు ప్రచారాలు చేస్తున్నారు. ఒకరిపై ఒకరు ముత్తైయిదులు గాజులు కొనుక్కోవడం పెట్టడం మన సాంప్రదాయాలు కానీ, ఇది సంక్రాంతి పీడ దినంగా ప్రచారం చేస్తూ గాజులు పెట్టుకోవడానికి డబ్బులు ఇవ్వాలి అంటూ మరో తల్లి గాజులు పెట్టుకోవడం అంతా కూడా విష ప్రచారమని పండితులు వాపోతున్నారు. గతంలో కూడా ఇలాంటివి చాలా వచ్చాయని, ఇలాంటి దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లో నమ్మదని పండితులు సూచిస్తున్నారు.

**మూఢనమ్మకాలను నమ్మవద్దు..**

**వేద పండితులు నిట్టూరి అంబరీష్ శర్మ.**



గ్రామాల్లో జోరుగా కొనసాగు తున్న సంక్రాంతి పండుగ కీడు దినం అనే మూఢ నమ్మకాన్ని ఎవరు నమ్మవద్దు. ఏ శాస్త్రంలో కూడా లేదు.గతంలో కూడా ఇటువంటి మూఢనమ్మకాలు దుష్ప్ర చారంలో ఉండేవి. వాటిని మేము ఖండించి ప్రజలకు వాస్తవమైన నమ్మకాన్ని కల్పించాం. మన సంప్రదాయాలకు, పండుగలకు ఎటువంటి కీడు ఉండదు, వాటితో ప్రజలకు సంబంధం ఉండదు అటువంటి దుష్ప్రచారం అవాస్తవం ప్రజలు ఎవరు ఇటువంటి దుష్ప్రచారాలను నమ్మవద్దు.

## రోడ్ల విస్తరణకు రు.50కోట్ల నిధులు కేటాయించండి

**- మంత్రి కోమటి రెడ్డికి ఎమ్మెల్సీ లేఖ**

**సూర్య జగిత్యాల**

జగిత్యాల నియోజక వర్గంలోని రోడ్లను డబుల్ రోడ్లు గా విస్తరించేందుకు రు.50 కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి లేఖ రాశారు. జగిత్యాలలో సింగిల్ లేన్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించాలని కోరారు. జగిత్యాలలోని జాతీయ రహదారి 63 తో అనుసంధాన రోడ్లు అభివృద్ధి కోసం 2024-2025 కేంద్ర రోడ్ల మౌలిక వసతుల నిధులు నుండి కేటాయించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి 63 కు అనుసంధాన రోడ్లు పొలాస నుండి ధర్మారం, ఆలూరు పంచాయతీ రోడ్డు, లక్ష్మీదేవి పల్లి, జాతీయ రహదారి ఉప్పు మడుగు నుండి ద్యావన్ పల్లి వరకు రోడ్ల విస్తరణకు రు.50 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి రాసిన లేఖ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కోరారు.

## బెస్ట్ క్లీన్ సిటీగా రెండోసారి కొత్తపెల్లి.

**- స్వచ్ఛ సర్వేక్షన్ 2023 క్లీన్ సిటీ అవార్డు.**

**సూర్య, కరీంనగర్ రూరల్**

దేశవ్యాప్తంగా మహా నగరాలు పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కు భారత దేశంలో అన్ని పట్టణాల్లో పోటీ పడగా దక్షిణ భారతదేశంలో 15000 లోపు జనాభా గల మున్సిపాలిటీలలో కొత్తపల్లి పట్టణానికి స్వచ్ఛ సర్వేక్షన్ 2023 క్లీన్ సిటీ అవార్డు సాధించింది, ఈ సందర్భంగా గురువారం కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు మాట్లాడుతూ కొత్తపెల్లి మున్సిపల్ కి దక్షిణ భారతదేశంలో రెండవసారి అవార్డు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు, క్లీన్ సిటీకి సహకరించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,బోయిన్పల్లి వినోద్ కుమార్, కలెక్టర్,అడిషనల్ కలెక్టర్, కమిషనర్ కట్ల వేణుమాధవ్ లకు,మున్సిపల్ కౌన్సిలర్లకు, కోఆప్షన్ సభ్యులకు, ఆర్పీలకు పట్టణ ప్రజలందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,కొత్తపల్లి మున్సిపల్ పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని తెలిపారు,

## అక్రమ కట్టడం కూల్చివేయాలని దీక్ష

**సూర్య జమ్మికుంట**



జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ శ్రీపతి నరేష్ నిర్మించిన అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని డిమాండ్ చేస్తూ జమ్మికుంట మాజీ వార్డ్ సభ్యుడు రవీందర్ రెడ్డి గాంధీ చౌరస్తాలో ఆవరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రవిచందర్ రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని భూమిని స్థానిక కౌన్సిలర్ కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడని తెలిపారు. అక్రమ కట్టడంపై మున్సిపల్, రెవెన్యూ, జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాన్ని కూల్చివేసి బాధ్యుడైన కౌన్సిలర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలువురు బిజెపి నాయకులు కాలనీవాసులు నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో 688 సర్వే నెంబర్లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని జమ్మికుంట మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో కూల్చివేశారు ఓవైపు స్థానిక గాంధీ చౌక్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష తూడి రవిచంద్ర రెడ్డి కొనసాగిస్తుండగానే మరో వైపు మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాన్ని కూల్చివేయడం గమనార్హం

## ఫిబ్రవరి మాసంలోగా ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు వసూళ్లు పూర్తి చేయాలి

**- గ్రామపంచాయతీల భవనాలను త్వరగా పూర్తి చేయాలి**

**- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఇంటి పన్నులు, కరెంట్ బిల్లులు ఫిబ్రవరి2024 మాసంలోగా వసూలు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతి రాజ్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం క్రింద ప్రతిరోజు ప్రతి గ్రామపంచాయతీలో 50 మంది కూలీలు కచ్చితంగా హాజరు కావాలన్నారు. వ్యవసాయ వ్యవసాయ అనుబంధ, సహజ వనరులు, వ్యక్తిగత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.2023 -24 లో హార్టికల్చర్ ప్లాంటేషన్ క్రింద నిర్దేశించిన లక్ష్యం ప్రకారం పనుల మంజూరు తీసుకొని ప్లాంటేషన్ పూర్తి చేయాలని, నర్సరీలు 100% బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలు వేయుపనిని పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు, మండల పరిషత్ డెవలప్మెంట్ ప్లాన్ నిర్ణీత సమయంలో తయారు చేయాలన్నారు. ఫిబ్రవరి 2024 లోపు ఇంటి పన్నులు కరెంట్ బిల్లులు వసూళ్లు పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ ఎల్ శ్రీలత, జడ్పీ సీఈవో పవన్ కుమార్, పంచాయతి రాజ్ ఈఈ శ్రీనివాసరావు, అదనపు డిఆర్డిఓ సంధ్యారాణి, డివిజనల్ పంచాయతీ అధికారి జి. లత, సహాయ పథక సంచాలకులు డాక్టర్ పి కృష్ణ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రవాసి కన్వీనర్ గా మంద భీంరెడ్డి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రవాస భారతీయుల విభాగం (టిపిసిసి ఎన్నారై సెల్) కన్వీనర్ గా వలస వ్యవహారాల విశ్లేషకులు, ప్రముఖ ప్రవాసి కార్మిక నాయకుడు మంద భీంరెడ్డిని నియమిస్తూ టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్ డా. బి.ఎం. వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవాసి భారతీయ దివస్ సందర్భంగా మంగళవారం రాత్రి హైదరాబాద్ లో నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి సేవ చేయడానికి గురుతరమైన బాధ్యత స్వీకరించాలని ఆశీర్వదించిన ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డికి, టిపిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, తనను నియమించిన కాంగ్రెస్ ఎన్నారై సెల్ చైర్మన్ డా. వినోద్ కుమార్ కు మంద భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## వరకట్న వేదింపులకు వివాహిత బలి

**- ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య - బావుసాయిపేటలో విషాదం**

**సూర్యకోనరావుపేట**

వరకట్న వేదింపులు తాళలేక వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బావుసాయిపేట గ్రామానికి చెందిన హైదర్, గోరిబి దంపతులు బండ కొడుతూ కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు అస్లాం ఉన్నాడు. అస్లాంకు వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామానికి చెందిన షేక్ నజీనా (25) అనే యువతితో నాలుగు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి మూడు నెలల పాప జన్మించింది. అస్లాం పెయింటింగ్ వేసేందుకు కూలీ పనికి వెళ్తాడు. షేక్ నజీనా ఇంట్లోనే పనిచేసుకుంటూ ఉంటుంది. ఈక్రమంలో గత కొన్ని నెలల నుండి నజీనాను అదనపు వరకట్నం తీసుకురావాలని వేదిస్తున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఇంట్లోవాళ్లు పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుంది. ఈ క్రమంలో మామా హైదర్ కూలీ పనికి వెళ్లి వచ్చి ఇంటి తలుపులు వేసి ఉండడం గమనించి మరో వైపు నుండి ఇంట్లోకి వెళ్లాడు. అప్పటికే నజీనా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్ కుమార్,ఎస్ఐ ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకుని వివాహిత మృతిచెందిన తీరును పరిశీలించారు. మృతురాలి తండ్రి మహమ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సింగరేణి సి.ఎస్.ఆర్ పనులను పరిశీలించిన అధికారులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం రత్నాపూర్,రాంనగర్ లో సింగరేణి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) నిధులతో జరిగిన పనులను అధికారులు గురువారం పరిశీలించారు. రత్నాపూర్, రాంనగర్ లో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి అయ్యాయి. ఈ పనులను ఆర్జీ-3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు ఆదేశాలతో డీవైపీఎం గుర్రం. శ్రీహరి, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ విక్రమ్, జూనియర్ సివిల్ ఇంజనీర్ రాజేశం, పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్, సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు,కాంట్రాక్టర్ కొండవేన ప్రభాకర్ కలిసి ఈ పనులను పరిశీలించారు.

## గల్ఫ్ హామీల అమలు కోసం కృషి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఇచ్చిన హామీల అమలు కోసం తాను చొరవ తీసుకుని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డితో చర్చించనున్నట్లు ఏఐసీసీ నాయకులు రామచంద్ర కుంతియా గురువారం తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు, ఎన్నారై పాలసీ ఏర్పాటుకు చర్యలు చేపట్టడంతో పాటు అత్యవసరంగా గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించడానికి జీ.ఓ. విడుదల గురించి ప్రత్యేకంగా సీఎంతో చర్చిస్తానని అన్నారు. కుంతియా హైదరాబాద్ కు విచ్చేసిన సందర్భంగా టిపిసిసి ఎన్నారై సెల్ బృందం గోల్కొండ హోటల్ లో స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా ఏడు సంవత్సరాలు సేవలందించి పార్టీ బలోపేతానికి కృషి చేసి నేటి గెలుపుకి బాటలు వేసిన కుంతియాను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. టిపిసిసి ఎన్నారై సెల్ చైర్మన్ డా. బి.ఎం. వినోద్ కుమార్, టిపిసిసి ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, టిపిసిసి ఎన్నారై సెల్ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, గల్ఫ్ జెఏసి నాయకులు స్వదేశ్ పరికిపండ్ల, గంగుల మురళీధర్ రెడ్డి, బాడాల జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు ప్రొ. ఆల్దాస్ జానయ్య లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సిరిసిల్ల జెండా ఎగరవేయాలి

## - రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జిందం చక్రపాణి

**సూర్య రాజన్న సిరిసిల్ల**

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి సిరిసిల్ల జెండా ఎగురవేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జిందం చక్రపాణి పిలుపునిచ్చారు.గురువారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి జూనియర్స్ కబడ్డీ క్రీడాకారుల శిక్షణ కేంద్రం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిందం చక్రపాణి మాట్లాడుతూ గజ్వేల్ లో నిర్వహించ నున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వెళుతున్న క్రీడాకారులు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో కూడ మంచి నైపుణ్యం కనబరిచి విజయం సాధించాలని, సిరిసిల్ల ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చి ఎంతోమందికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎంతో మంది క్రీడాకారులు క్రీడా అభిమానులు క్రీడలను ప్రోత్సహించేవారు ఉన్నారన్న, ఆయన ఈ శిక్షణ కేంద్రం నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించేలా గత ప్రభుత్వ హయాంలో అనేక కార్యక్రమాలు నిర్వహించి, క్రీడారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ స్థానిక శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు సిరిసిల్ల పట్టణంలో సకల సదుపాయాలతో మినీ స్టేడియం నిర్మించి అందులో వాలీబాల్ అకాడమీ కూడ ఏర్పాటు చేయడం జరిగిందని, సిరిసిల్ల పట్టణం నడిబొడ్డున ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్ ను దాదాపు రెండున్నర కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయిస్తున్నారని అన్నారు. గత సంవత్సరం సిరిసిల్లలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిం చేలా అన్ని సహాయ సహకారాలు అందించి కబడ్డీ క్రీడ పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించేలా స్థానిక ఎమ్మెల్యే





కేటీఆర్ కృషి చేశారని గుర్తు చేశారు. శిక్షణ శిబిరంలో శిక్షణ పొందిన క్రీడాకారులందరూ ఉత్తమమైన క్రీడాకారులుగా భవిష్యత్తులో జరగబోయే రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని విజయం సాధించాలని అందుకోసం నిరంతర సాధన ప్రతి క్రీడాకారునికి అవసరం అన్నారు. శిక్షణ శిబిరం ద్వారా క్రీడాకారులు ఉత్తమమైన క్రీడ నైపుణ్యాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో కబడ్డీ విభాగంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా కౌన్సిలర్ గెంట్యల శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కోడి అత్తయ్య, బొద్దు రాములు, సెక్రెటరీ తిరుపతి, ఏఐఎఫ్బి నాయకులు పత్తిపాక సురేష్, సిరిసిల్ల కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణ, ముస్తఫా, రామకృష్ణ , శిక్షణ కేంద్రం శిక్షకులు ప్రశాంత్, క్రీడాకారులు, కబడ్డీ అభిమానులు పాల్గొన్నారు.




## వేగంగా కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ

**సూర్య బోయినపల్లి**



ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తులు ఆన్లైన్ నమోదు బోయినపల్లి మండల పరిషత్ కార్యాల యంలో వేగంగా గురువారం నాటికి 80 శాతం పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ ఆరవ తేదీ మొదలుపెట్టగా 17వ తేదీ వరకు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో కార్యదర్శులు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు వేగవంతంగా అధికారుల పర్యవేక్షణలో ఎలాంటి తప్పులు లేకుండా ప్రజా పాలన దరఖాస్తులు ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నట్టు ఎంపీడీవో నల్ల రాజేందర్ రెడ్డి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ఆరిఫ్, కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఉన్నారు.

## అంగన్వాడిలో సంక్రాంతి సంబురాలు

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలంలోని వీర్నపల్లి, గర్జనపల్లి అంగ న్వాడి కేంద్రాలలో అంగన్వా డి టీచర్ నాగరాణి, సుశీల చిన్నపిల్లలతో వివిధ వేషధా రణలతో అంగన్వాడి కేంద్రం లో సంక్రాంతి పండగ సెలబ్రేషన్ సంక్రాంతి పండగ గురించి రైతులు కష్టపడి పనిచేసే పండించిన పంట ఇంట్లోకి తెచ్చుకొని కొత్త సంబరాలతో కొత్త వంటలతో సంక్రాంతి పండగ జరుపుకుంటారని పిల్లలకు చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ నాగరాణి, సుశీల ఆయమ్మ రాధా రంగురంగుల ముగ్గులతో పిల్లలని ఆనందింపజేశారు.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది

### - చక్రధర్ రెడ్డి

**సూర్య సిరిసిల్ల టౌన్**



మేడిగడ్డ కూలడం వల్లే అప్పర్ మానేరుకు నీరు రావడంలేదని అయినప్పటికీ నీటిని తెప్పించేం దుకు సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ తో మాట్లాడడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కనమనేని చక్రధర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నీళ్ల ఇవ్వడంలేదని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సరికాద న్నారు. గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ అప్పర్ మానేరుకు కాంగ్రెస్ పార్టీ కావాలనే నీళ్లు వదలడం లేదని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం సరికాద న్నారు.మేడిగడ్డ కూలిపోవడం వల్లే నీటిని దిగువకు వదులుతున్నారని అన్నారు.అయినప్ప టికీ మానేరుకు నీటిని తెప్పించేందుకు సంబంధిత మంత్రి ఉత్తంకుమార్ తో మాట్లాడడం జరుగుతుం దని రైతులెవ్వరు అధైర్యపడవద్దని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మూడు నెలలు కూడా సజావుగా పాలన అందించలేదని కేటీఆర్ అనడం శోచనీయమన్నారు. బిఆర్ఎస్ పార్టీ కొంతమంది నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేశారని,నెలరోజుల కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని చక్రధర్ రెడ్డి అన్నారు.ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన దందాలు ప్రజలకు అర్థమైందని రానున్న రోజుల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్తారని చక్రధర్ రెడ్డి అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరు బాలరాజు, మాజీ ఫ్లోర్ లీడర్ ఎల్లె లక్ష్మీనారాయణ,పాతూరి భూపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ చేనేత సెల్ అధ్యక్షుడు గోనే ఎల్లప్ప,సత్తు శ్రీనివాసరెడ్డి,మీరాల శ్రీనివాస్ యాదవ్, కందుకూరి బలరాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మానేరు రచయితల ఆధ్వర్యంలో అలిశెట్టి ప్రభాకర్ కు ఘన నివాళులు

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్లలోని బాల బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మానేరు రచయితల సంఘం ఆధ్వర్యంలో సమాజ సాహితీవేత్త అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి,వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మానేరు రచయితల సంఘం అధ్యక్షుడు టివి నారాయణ మాట్లాడుతూ అలిశెట్టి తన మినీ కవితలతో సమాజంలో ఒక అక్షర సూర్యుడిగా ఎదిగారని,ఏనాడు తన వ్యక్తిగత జీవితం కోసం కాకుండా సమాజ హితం కోసం చిన్నచిన్న కవితలు రాస్తూ జనజీవన గుండెల్లో,మంటల సూర్యుడుగా నిలబడ్డాడని అన్నారు.ఈ కార్యక్రమం లో మానేరు రచయితల సంఘం నిర్వాహక కార్యవర్గ సభ్యులు ఎలగొండ రవి,పాఠశాల ప్రధానో పాధ్యాయులు శారద, జయంతి,సతీష్ బాబు రమేష్,బూర దేవానందం, ఆడెపు లక్ష్మణ్,నరేందర్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ఖాళీ సీట్ల ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల

**సూర్య బోయినపల్లి**



బోయినిపల్లి మండల కేంద్రంలో టిఎస్ మోడల్ స్కూల్ బోయినిపల్లి తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలనందు 2024-25 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతిలో గల 100 సీట్లకు 7వ తరగతి నుండి 10వ తరగతివరకు ఖాళీ సీట్ల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయిందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. సుధాకర్ గురువారం. ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా నుండి ఈనెల 12వ తేది పిబ్రవరి 225 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 7వ తేదీన ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష 4 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 7వ, తరగతి నుండి 10వ తరగతులలో గల ఖాళీ సీట్లకు ప్రవేశ పరీక్ష వుంటుందని దరఖాస్తు రుసుం జనరల్ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు తెలిపారు. రూ. 200 ఇతర విద్యార్థులకు రూ. 125 వుంటుందని తెలిపారు. హాల్ టికెట్స్ ఏప్రిల్ 1వ తేది నుండి ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం హెచ్ పిటిటి తెలంగాణ స్. సిజిజి గోవ్స్, ఇన్ వెబ్సైటులో సంప్రదించగలరు. మరిన్ని వివరాల కోసం 9849484791 ఫోన్ నంబర్లో సంప్రదించగలరు అని ప్రిన్సిపల్ సుధాకర్ తెలిపారు.

## ఎంపీపీఎస్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలంలోని ఎంపీపీఎస్ వీర్నపల్లి పాఠశాలలో గురువారం రోజున ముందస్తు మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సారంపల్లి కళావతి మాట్లాడుతూ పల్లె వాతావరణం ఉట్టిపడేలా పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి వేడుకలను మహోత్సవంగా నిర్వహించడం చాలా శుభప్రదమని అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రకరకాలైన పిండి వంటలు ను పెద్ద ఎత్తున చేసుకొని సోదర భావం ఉట్టిపడేలా ఒకరికి ఒకరు ఇచ్చిపుచ్చుకొని పండుగ వైభవాన్ని చూపుతారని చెప్పారు. ఇట్టి వేడుకలలో భాగంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల రిబ్బన్లతో మావిడాకులతో పూలతో చాలా చక్కగా ఆకర్షణీయంగా అలంకరించి . ఇట్టి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలను నిర్వహించడం జరిగింది. పండుగ వాతావరణంలో ఆనందోత్సవాల మధ్య కేరింతల మధ్య విద్యార్థిని విద్యార్థులు వివిధ రంగురంగుల సాంప్రదాయ దుస్తులతో రావడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జక్కుల నరేష్ , సభ్యులు లెంకల లక్ష్మణ్ ఉపాధ్యాయులు సరస్వతి, గజన్, బాలకిషన్ ,రజిత, జోష్ణ ,అశ్విని, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

## విలాసాగర్ హైస్కూల్లో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**సూర్య బోయినపల్లి**



సంక్రాంతి పండుగ సమీపిస్తుం డడంతో రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయిన్ పల్లి మండలం విలాసా గర్ హై స్కూల్ లో గురువారం ముందస్తుగా పాఠశాల ప్రధానోపా ధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహిం చిన సంక్రాంతి పండుగ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా విద్యార్థులు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ వేషధారణ ద్వారా విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. భోగి మంటలు వేయడం, హరిదాసుల వేషధారణలతో విద్యార్థులు డప్పు వాయి ద్యాలు వాయిస్తూ, గంగిరెద్దుల తో బసవన్న నృత్యాలు చేయించడం, రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు తో అలంకరించడం, బెల్లమన్నం, బొప్పట్లు, భగవంతునికి నైవేద్యం సమర్పించి భోగి ,సంక్రాంతి, కనుమ తదితర పండగల ప్రత్యేకతను ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గ్రామస్థులు తరలివచ్చి విద్యార్థుల ప్రదర్శన తీరుపై సంతృప్తి చెంది వారిని ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా జాతీయ యువజన దినోత్సవం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు స్వామి వివేకానంద స్ఫూర్తి తో మన దేశం కీర్తి ప్రతిష్టలు నలుమూలల చాటాలని ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్ అన్నారు., ఈ కార్యక్రమంలో ఎం రాజిరెడ్డి కె. శోభారాణి ,కె.వెంకట హనుమాన్,వి. సురేందర్ రెడ్డి,కె మధుసూదన్,ఎ, జోష్ణ రాణి,బి ప్రకాష్, ఏ రాధిక ,పి మోహనకృష్ణ, వి ,వసుంధర, పి ఈ టి టి. మధుకర్ రెడ్డి , సి.హెచ్ స్వర్ణలత కె.శమంతకమణి ,జా,అ మమ్మద్ షఫీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర ఓబన్న పోరాట స్ఫూర్తి మనకు ఆదర్శం కావాలి

**– విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, భావితరాల వారికి ఆయన పోరాట పటిమ తెలియజేయాలని ధర్మపురి శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గురువారం రోజున వడ్డే ఓబన్న 217 వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ లో అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ముఖ్య అతిథిగా పాల్గొన్న విప్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న జన్మదినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మొట్టమొదటి సారిగా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. 1807 జనవరి 11 న కర్నూల్ లో జన్మించిన ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. 10 వేల మందితో సైన్యం ఏర్పాటు చేసుకొని బ్రిటీష్ సైన్యంతో పోరాడిన మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. ఒడ్డెర కులస్తులకోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. రాష్ట్రంలో నివసిస్తున్న ఒడ్డెర కులస్తుల కష్ట సుఖాలు పరిశీలించి వారి కుటుంబాలకు ప్రభుత్వం నుండి సహకారం అందజేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఒడ్డెర కుటుంబాల్లోని భార్యాభర్తలు కష్టపడి జీవితం సాగించేవారని అన్నారు. ఒడ్డేరలను ఎస్టి జాబితాలో చేర్పించడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారంటీల పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. జిల్లాలోని ఒడ్డెర కులస్తులకు సహకారం అందిస్తామని తెలిపారు. పేదల సంక్షేమం, జిల్లా సమగ్రాభివృద్ధికి కలసి కట్టుగా కృషి చేద్దామని ఆయన పిలుపుని చ్చారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో చరిత్ర సృష్టించిన ఓబన్న చరిత్ర ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. కష్టాలనే నమ్ముకున్న ఒడ్డెర కుటుంబాలను ప్రభుత్వం నుండి సహకారం అందించాలని కోరారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అని అభివర్ణించారు. జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. గొప్పవారిని స్మరించుకొని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. వడ్డే కులస్తుల సామజిక ఆర్థిక స్థితిగతులు పెంపొందించే దిశగా అడుగులు వేయాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిసి బంధు పథకాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ బి.ఎస్. లత మాట్లాడుతూ మహోన్నతులు, స్వాతంత్ర్య సమరయోధులు జయంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతున్నదని, వడ్డెర ఓబన్న జయంతి వేడుకను మొట్ట మొదటి సారిగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. వడ్డేరులు కష్టపడేతత్వం ఉందని, స్వతంత్ర జీవులని, ఓర్పు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఆనాటి ఉద్యమకారుల చరిత్రను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని అన్నారు. ఒడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగిలయ్య మాట్లాడుతూ కర్నూల్ జిల్లాలో పుటిన ఓబన్న ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొని సైన్యాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, శిస్తుల వసూళ్లకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి అని అన్నారు. భవన నిర్మాణాలకు అవసరమైన రాయి కొట్టడం ఒడ్డెర కులస్తుల జీవనోపాధి అని అన్నారు. కష్టార్జితంతోనే జీవనం సాగిస్తారని అన్నారు. ఆధునిక యోగంలో క్రషర్స్ రావడంతో జీవనోపాధి కష్టతరంగా మారిందని అన్నారు. ప్రభుత్వాలు ఒడ్డెర కులస్తులకు జీవనోపాధి కల్పించాలని కోరారు. అలాగే ఎస్టి జాబితాలో ఒడ్డెర కులస్తులను చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంక్షేమ అధికారి సాయిబాబా, మున్సిపల్ ఇంచార్జ్ చైర్మన్ గోలి శ్రీనివాస్, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్, బి.సి., ఒడ్డెర కుల సంఘాల నాయకులు, కలెక్టరేట్ లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలి

**– అడిషనల్ డీజీపీ షిక గోయల్**

**– వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన చర్యల గురించి అడిషనల్ డీజీపీ షిఖ గోయల్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ పెరిగిపోతున్న సాంకేతికత కు తగ్గట్టుగానే దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించి ప్రతి పోలీస్ స్టేషన్ లో ఒకరిని సైబర్ వారియర్ గా నియమించడం జరిగిందని, అదే విధంగా జిల్లా స్థాయిలో డిస్టిక్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేసి డిఎస్పి స్థాయి అధికారి ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న సైబర్ నేరాల యొక్క దర్యాప్తును పరిశీలించటం పెరుగుతుందని అన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంతో పాటు ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అవగాహన కల్పించడం, అన్ని స్థాయిల పోలీస్ అధికారులకు సైతం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సైబర్ క్రైమ్స్ పట్ల మరింత అవగాహన కలిగిఉండాలని అన్నారు. చాలామంది ప్రజలు అవగాహన లోపం వల్ల సైబర్ క్రైమ్ బారిన పడుతున్నారని ముఖ్యంగా ఓటిపి ఫ్రాడ్స్ ఎక్కువగా జరుగుతున్నా యన్నారు. సైబర్ క్రైమ్ బారిన పడకుండా ప్రజలను చైతన్యపరిచి 1930కు కాల్స్ చేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ జిల్లాల్లో, వివిధ రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్లు ను అరెస్ట్ చేసిన సందర్భంలో వారిని పిటి వారెంట్ పై తీసుకొచ్చి అరెస్ట్ చేయాలని సూచించారు. సైకాప్స్ వంటి నూతన సాంకేతికను ఉపయోగించి సైబర్ నేరస్తులను పట్టుకోవాలని అన్నారు. అనతరం పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు ఇతర సీనియర్ పోలీసు అధికారుల నుండి సైబర్ నేరాల నియంత్రణ పై తీసుకోవలసిన చర్యల పై పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ,అదనపు ఎస్పీ ప్రభాకర రావు , సైబర్ క్రైమ్ డీఎస్పీ సురేష్ , ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ , సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చండీయాగం

**– కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్**

**సూర్య-గోదావరిఖని:**

ఇక్కడి రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శాస్త్రోక్తంగా చండీయాగం నిర్వహించారు. ఋత్విజులు వేద మంత్రాలు పఠిస్తుండగా రాజ్ ఠాకూర్ దంపతులు చండీ యజ్ఞవాటికలో పుణ్యాహవచణం నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా గోపూజ, గురుపూజ జరిగింది. అరణి నుంచి అగ్నిని మథించడం ద్వారా రగిలిన నిప్పుతో యజ్ఞం ప్రారంభించారు. సుమారు మూడు గంటలపాటు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ దంపతులు అక్కడే కూర్చుని పూజలు జరిపారు. రుత్విజుల పారాయణాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యాగవల్లిగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని, అన్ని రంగాల్లో రామగుండం నియోజకవర్గాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ఆధార అభిమానాలు మరువలేనివని, నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అప్పుడే ఆ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ఈ యాగంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ దాని అనుబంధం సంఘాల నాయకులు, పలువురు మహిళలు పాల్గొన్నారు

## సంప్రదాయ పద్ధతిలో మొక్కలను పెంచాలి

**– జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



నర్సరీలలో పెంచే మొక్కలను ఫర్టిలైజర్ తో కాకుండా సంప్రదాయ పద్ధతిలో పెంచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గురువారం తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలని లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వార నిర్వహిస్తున్న నర్సరీని, మహాత్మానగర్ లోని సంపద వనాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ, నర్సరీలలోని మొక్కల పెంపకాన్ని ఫెర్టిలైజర్ లతో కాకుండా సంప్రదాయ పద్ధతిలో జీవామృతం వంటి వాటిని వాడాలని సూచించారు. అదే విధంగా మొక్కలను ప్లాస్టిక్ బ్యాగులలో కాకుండా సీడ్ బాల్స్ లా తయారు చేసి పంపిణీ చేయాలని తెలిపారు. అనంతరం నర్సరీలలోని మొక్కలను పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ శ్రీలత, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీఓ రవీందర్, ఎంపిఓ కిరణ్ కుమార్, ఏపీఓ లలిత, ఈసి రాజు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాతికి ఉరికెళ్తున్నారా.. పోలీస్ వారి సూచనలు పాటించండి...

**– సోషల్ మీడియాలో లొకేషన్, ప్రయాణాలకు సంబంధించిన అప్డేట్స్ పెట్టకండి – స్వీయ రక్షణ కు ఇంట్లో సీసీ కెమెరా అమర్చుకోవడం మంచిది**

**రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి**

**సూర్య-గోదావరిఖని:**



సంక్రాతి పండుగ సెలవులకు సొంత ప్రాంతాలకు, బంధువుల ఇండ్లకి, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ, ఆపార్టుమెంట్ లలో నివ సిస్తున్న ప్రజలు వరుసగా జరుగుతున్న దొంగ తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రామ గుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో కోరారు. చోరీల నియంత్రణకు తమ పోలీసులు ఎప్పటికప్పుడు నిఘా పెంచుతు న్నప్పటికీ, ప్రజల అప్రమత్తత కూడా అవసరమని సూచించారు. ఈ సందర్భంగా సిపి పలు సూచనలు చేశారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చు కోవాలని, బీరువా తాళాలను ఇంట్లో ఉంచకుండా తమతో పాటే తీసుకువెళ్లాలని చెప్పారు. సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం, సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సర్ ను ఏర్పాటు చూసుకోవడం మంచిదని, ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్టేషన్ లో సమాచారం ఇవ్వాలని తద్వారా వారి వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలని, ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్ తో లాక్ వేయడం మంచిదని పేర్కొన్నారు. నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్, సెక్యూరిటీ గార్డ్, సర్వెంట్ గా నియమించుకోవాలి, ఇంట్లో స్వీయ రక్షణ కోసం సీసీ కెమెరాలను అమర్చుకోవడం మంచిదని, ఆన్ లైన్‌లో ఎప్పటికప్పుడు మొబైల్ లో ఇంటిని, పరిసరాలను ప్రత్యేక్షంగా చూసుకొవచ్చునని అన్నారు. సెక్యూరిటీ సర్వేలైన్స్ కు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలి. ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని, ఇంట్లో లేనప్పుడు పని మనుషులు అందుబాటులో ఉన్నవారు రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలని, ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్స్, పాలప్యాకెట్లు పడి ఉండకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, డయల్ 100కు కాల్ చేయాలని చెప్పారు. ముఖ్యంగా విహారయాత్రలకు, దూర ప్రాంతాలకు వెళ్లేవారు తాము ఎక్కడ ఉన్నాము అనే విషయాలను సోషల్ మీడియాలో పెట్టకూడదని, లోకేషన్, ఏ ప్రాంతాల్లో ఉన్నారు, మళ్ళీ ఎక్కడికి వెళ్తున్నారు.. అనే విషయాలను వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వాటిలో పోస్ట్ చేయకూడదని సూచించారు. ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ సహకరిస్తే దొంగతనాలకు అడ్డుకట్ట వేయవచ్చునని సిపి తెలిపారు.

# పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

## - హుజురాబాద్ ఏసిపి ఎల్. జీవన్ రెడ్డి

**సూర్య, ఇల్లందకుంట**

భోగంపాడు శివారులో 2021 నుండి సుమారు రూ.6,44,436 ప్రభుత్వ నిధులతో ఒక ఎకరా విస్తీర్ణం మేర ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ ఏసిపి యల్. జీవన్ రెడ్డి అన్నారు. వివరాల్లోకి వెళితే సిరిసేడు గ్రామ ఎంపీటీసీ అయిన ఎ-1 రేనికుంట్ల చిన్నరాయుడుని ఎ-2 రేనికుంట్ల రామస్వామి అనునతడు తనకు ఎటు వంటి భూమి లేదని ఎక్కడైన భూమి ఉంటె చెప్పు అని అడుగగా అందుకు చిన్నరాయుడు సిరిసేడు, బోగంపాడు గ్రామా సరిహద్దుల్లో ఎంమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ పథకం లో భాగంగా కాలుష్య నివారణకు ప్రభుత్వం వారిచే పెంచబడుతున్న సర్వే నెంబర్ 585 లో గల పల్లె ప్రకృతి వనంను చూపించి అట్టి భూమిని ఎ-2 కి ఒక గుంటకు 5 వేల రూపాయలకు అమ్ముటకు ఒప్పదం కుదుర్చుకొన్నాడని అది ప్రభుత్వ భూమి అని



ఇరువురికి తెలిసునని అయిన కూడా చిన్నరాయుడు అట్టి భూమి ఇస్తా అనగా రామస్వామి అందుకు ఒప్పుకొని మొదట 10వ వేల రూపాయలు ఇవ్వగా అట్టి డబ్బు తో జేసిబి సాల్వాల రమేష్ కు చెప్పి సిరిసేడు గ్రామ సరిహద్దుల్లో పల్లె ప్రకృతి వనం లో గల చెట్ల ను తొలగించుటకు ఒప్పుకొని తన డ్రైవర్ అయిన క్యాదసి శశి కుమార్ తో జెసిబి ని పంపి చెట్లను ఒక ఎకరం మేర తొలగించి నేలను చదును చేసారని, పల్లెప్రకృతి వనంను అక్రమించుకోవాలనే ఉద్దేశంలో నేరస్తులు రేనికుంట్ల చిన్నరాయుడు అదేశాల మేరకు దాదాపు ఒక ఎకరంలో గల చెట్లను తొలగించడం జరిగిందన్నారు. ఇట్టి సంగటన పై సిరిసేడు గ్రామ కార్యదర్శి దాసరాపు అంకూస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే గురువారం నాడు పై నలుగురు మిగిలిన చెట్లను తొలగించి నేలను చదును చేయటకు వెళ్తున్నారనే సమాచారం మేరకు వారిని సిరిసేడు గ్రామ బస్ స్టాండ్ వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. నేరానికి ఉపయోగించినా జెసిబి %బా 02 జు=% 5373 ని కూడా సీజ్ చేశామని ఏసీపి తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే ఇలాంటి చర్యలకు పాల్పడడం మంచి సంస్కృతి కాదని ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండాలన్నారు. ఈ సంఘటనని చాలెంజ్ గా తీసుకుని కేసును చేదించిన రూరల్ సీఐ కోర కిషోర్, ఇల్లందకుంట ఎస్సై నాంపల్లి రాజకుమార్, ఇతర పోలీస్ సిబ్బందిని అభినందించారు.

## నూతన ఎస్ఐ వంశీకృష్ణకు సన్మానం

**సూర్య, వీణవంక**



ఇటీవల బదిలీలో భాగంగా వీణవంక మండల కేంద్రానికి ఎస్ఐ వంశీకృష్ణ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఎస్ఐ వంశీకృష్ణను హిమ్మత్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గుంపుల గట్టయ్య, నల్లగోస శ్రీనివాస్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య చందుర్తి**



మండల కేంద్రంలోని నవత ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అలాగే మండలంలో ని సనుగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధయు లు నవత కోరసపెండెంట్ నాగరాజు బహుమతులు అందజేశారు. అనంతరం భోగి మంటలు వేశారు. పిల్లలు వివిధ వేషధారణలో అలరించారు. అలాగే విద్యార్థులు గాలిపటాలు ఎగరవేస్తూ కేరింతలు వేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యా భారతి విద్యాసంస్థల లో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ముందస్తు సంక్రాంతి సంబరాలను పల్లెలలో జరుపుకునే విధంగా భోగి మంటలు పెట్టి రంగురంగుల ముగ్గులు వేసి విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పల్లె అందాలు ఉట్టిపడే విధంగా వివిధ వేషాధారణలచే చేసి అందరిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## యజ్ఞశాల నిర్మాణానికి భూమి పూజ

**సూర్య,కోరుట్ల టౌన్**



పట్టణ శివారులోని శ్రీ సీతారామ దేవాలయంలో యజ్ఞశాల నిర్మాణానికై గురువారం భూమిపూజ నిర్వహించినట్లు ఆలయ అధ్యక్షుడు వనతడుపుల మురళి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యజ్ఞశాల నిర్మాణానికై ఎక్కల్ దేవి అంజయ్య విరాళాన్ని అందించినట్టు, విరాళాలు ఇచ్చే భక్తులు ఆలయంలో సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పైకారి రవి, కార్యవర్గ సభ్యులు కటకం సునీల్,దామోదర్, ప్రభాకర్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల ఔదార్యం

**సూర్య, మెట్ పల్లి టౌన్**



పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో అటెండర్ గా సేవలందిస్తున్న బాజోజి నరసయ్య కు గురువారం ఆర్థిక సాయం అందజేసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు. నరసయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నట్లు ఉపాధ్యాయుల దృష్టికి రావడంతో మండల ఉపాధ్యక్షులు అందరు కలిసి తక్షణ అవసరాల కోసం పద్దెనిమిది వేల ఒక వంద పదహారు(18116) రూపాయలను నరసయ్యకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు మురళి రామేశ్వర్, తాహెర్, వేణుగోపాల్, ఆగమయ్య, బాలకిషన్, రాజేందర్, విజయభాస్కర్ పాల్గొన్నారు

## ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులకు ఘన సన్మానం.

**సూర్య, రాయికల్**



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులను,సిబ్బందిని రాయికల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగ్గా సన్మానించారు.ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరణ దగ్గర నుండి ముగింపు వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా,దరఖాస్తులు ఆన్లైన్ చేసిన మున్సిపల్ సిబ్బందిని కాంగ్రెస్ పార్టీ పక్షాన ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,దివాకర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి,మహమ్మద్ షాకీర్,బత్తిని భూమయ్య,రాకేష్ నాయక్,మొబిన్,కడకుంట్ల నరేష్,దుబ్బాక రాజిరెడ్డి,మున్ను ,రాజేష్ ,మధు, రాజీవ్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానంద జయంతోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా అదనపు కలెక్టర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



యువతకు ఆదర్శ ప్రాయుడైన స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని గురువారం రోజున కలెక్టరేట్ లోని వారి కార్యాలయంలో తెలంగాణ యువజన సమితి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్ ను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ మాట్లాడుతూ స్వామి వివేకానందుని ఆదర్శాలను ఆశయాలను యువత మరువరాదని కొనియాడారు.యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని యువత తలుచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని స్వామి వివేకానందుని అడుగుజాడల్లో యువత నడవాలని కోరారు. తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షులు సత్తినేని శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 10.00 జ్యోతి నగర్ లోని శివ థియేటర్ ముందు గల స్వామి వివేకానంద కా%శీ%స్య విగ్రహం ముందు పూల మాలలు వేసి, నివాళులర్పించి జిల్లాలో విశిష్ట సేవలు అందించిన యువతకు జిల్లా స్థాయి యువసేవ పురస్కార్ అవార్డు 2024 ప్రధానం చేయడం జరుగుతుంది అని తెలిపారు. కావున జిల్లాలోని కార్పొరేటర్లు ,ప్రజాప్రతినిధులు , యువజన ,స్వచ్ఛంద ,మహిళ విద్యార్థి సంఘాల ,నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నామ న్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా కన్వీనర్ వొడ్నాల రాజు ,జిల్లా కో-కన్వీనర్ లోనే నాగరాజు ,యువజన విభాగం ప్రతినిధులు పేరుమాండ్ల అభిషేక్ గౌడ్, హనుమంతు పాల్గొన్నారు.

## కేంబ్రిడ్జ్ పాఠశాలలో సంక్రాంతి పండుగ ముందస్తు సంబరాలు

**సూర్య - మానకొండూర్**



మానకొండూరు మండల కేంద్రంలోని కేంబ్రిడ్జ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ఆవర ణలో చూడ ముచ్చటగా గొలుపే రంగవ ల్లులు వేసి ఆకట్టుకున్నారు. చిన్నారులపై బోగు పళ్ళు వేసి దీవించారు. విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలదించారు.అమ్మాయిలకు ముగ్గుల పోటీలు, అబ్బాయిలకు పతంగి పోటీలను నిర్వహించారు.అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పిల్లలచే భోగిమంటలు వేయించడంతో పాటు పిండి వంటకాలు చేయించారు. విద్యార్థులకు సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను పాఠశాల కరస్పాండెంట్ దుంపేటి అంజలి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వివరించారు.పండుగకు ఒకరోజు ముందు 'భోగి' పండుగను జరుపుకుంటారని. దక్షిణ యానానికి భోగిని చివరి రోజుగా పరిగణిస్తారన్నారు. అందుకే దక్షిణాయానంలో పడిన కష్టాలు, సమస్యలన్నీ భోగి మంటల రూపంలో అగ్ని దేవుడికి సమర్పించి రాబోయే ఉత్తరాయణ కాలంలో సుఖసంతోషాలను ప్రసాదించాలనే పరమార్థమే భోగి పండుగ విశిష్టత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, సరిత, గీత, నర్మదా, మౌనిక, సుధ, రుచిత, రోజా చందన, సువర్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గీర్వాణి పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

**సూర్య, చొప్పదండి**



పట్టణంలోని గీర్వాణి పాఠశాలలో చైర్మన్ కొండ గంగయ్య ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు అందుర్తి లత ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు ఆటపాట కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా హరి దాసు, నాంచారమ్మ వేషధారణలతో అలరించారు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు, పతంగిలు ఎగరవేయడం జరిగింది.తెలుగింటి ఆడపిల్లల వస్త్రధారణ పల్లెటూరి జానపద నృత్యాలు, సంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ సిరిపురం శ్రీనివాస్, కోదూరి నాగరాజు, ఉపాధ్యాయురాలు సుమలత, కీర్తి ప్రియ, అక్షయ, సిరి చందన, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం లో వీఆర్ఏ మృతి

### - డ్యూటీ చేస్తుండగలిగుండె పోటు తో మరణించిన ధర్మపురి

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోని తహసీల్దార్ కార్యాలయం లో డ్యూటీ చేస్తుడగానే వీఆర్ఏ మృతి చెందాడు. తహసీల్దార్ కార్యాలయం లో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏ గుమ్మడి ధర్మపురి (65) గుండె పోటు తో మరణించినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. గురువారం రోజు ఉదయం పది గంటల సమయం లో డ్యూటీ కి వెళ్ళిన గుమ్మడి ధర్మపురి కి అకస్మాత్తుగా గుండె పోటు రావడం తో సంఘటన స్థలం లోనే మరణించాడు. ఈ సంఘటన తో ఒక్కసారి గా కార్యాలయ సిబ్బంది తోటి ఉద్యోగులు కుటుంబ సభ్యులు దుఖం తొ బాధపడ్డారు. వారి కుటుంబ సభ్యుల ఆవేదన ను చూసిన ప్రతి ఒక్కరు బాధపడ్డారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**సూర్య వేములవాడ**

వేములవాడ మున్సిపల్ పరిధి కోనాయిపల్లి శివారులో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచా రం తో సంఘటన స్థలంలో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు.

## సొంత గూటికి చేరిన కౌన్సిలర్

**సూర్య -కోరుట్ల**



జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణానికి చెందిన 18 వ వార్డ్ కౌన్సిలర్ పరహత్ రహీం ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరగా గురువారం ఆయన తిరిగి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు .ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఎవ్వరు కూడా పార్టీ మారే ఉద్దేశం లేదని మేమందరం కూడా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నాయకత్వంలో పనిచేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ అధ్యక్షులు అన్నం అనీల్ , మండల బీఆర్ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ , నాయకులు ఎస్డీ ఫహీం, సజ్జు భాయ్ , బాబా భాయ్ , జిందం లక్ష్మినారాయణ,బద్ధీ మురళి , సనావోద్దీన్, మోసిన్, తలహా తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళ బృందం తో ప్రజలకు అవగాహన కార్యక్రమం

**సూర్య, మెట్ పల్లి టౌన్**

మెట్పల్లి మండలం వేంపేట్ గ్రామంలో గురువారం జిల్లా పోలీస్ కళా బృందం తో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.ఐ మట్లాడుతూ నేను సైతం అనే కార్యక్రమం ద్వారా పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది అని దీని వల్ల గ్రామంలో ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు. అలాగె సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని గ్రామస్థులను కోరారు. తల్లిదండ్రులు పిల్లలను ఉన్నత



చదువులు చదివించాలని అన్నారు. యూత్ చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం మరియు పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని తెలిపారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని అలాగె హెల్మెట్ అవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని, అలాగె గ్రామంలో చిన్న చిన్న తగదలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామలుగా చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రలు, తంత్రాలు అంటూ ముడనమ్మకాలు ఏవి నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలనీ సూచించారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

**సూర్య, చందుర్తి**



చందుర్తి మండలం బండపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాసం ఉత్సవాలలో భాగంగా గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనుర్మాసం ఉత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిరోజు కుంకుమ పూజ కార్యక్రమాలను శ్రీ గోదాదేవి అమ్మవారికి నిర్వహించడం జరుగుతుందన్నారు, ఈనెల 13 వ తేదీన శనివారం ఉదయం 10:35నిమిషాలకు ఆలయంలో గోదా రంగనాథుల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరు కావాలన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా భక్తులు గోవింద మాలలు ధరించారు

## బదిలీపై వెళ్లిన గురువులకు ఆత్మీయసన్మానం.

**సూర్య,రాయికల్**



రాయికల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను విద్యార్థులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు పూల తో ఘనంగా స్వాగతం పలికారు. సభ వేదిక పైన గురువులతో అనుబంధాన్ని పంచుకుంటూ తమ ప్రియ ఉపాధ్యాయులు ఏసాల రాజన్న,గోపు రాజేశం,జనార్ధన్,స్వర్ణలత లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గురువుల ఆశీస్సులను విద్యార్థులు పొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపతి రాఘవులు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. బదిలీపై వెళ్లిన చోట కూడా మంచి విద్యాబోధన చేసి,మంచి గుర్తింపు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ కడకుంట్ల లహరి, ఉపాధ్యాయులు పొన్నం రమేష్,రవీందర్,మల్లేశం, సత్యనారాయణ,గంగ జమున,జ్యోతి,సుజాత, వనజ తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి విద్యాలయం లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**సూర్య మేడిపల్లి**



మండలంలోని కొండాపూర్ గ్రామం సరస్వతి విద్యాలయం లో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భోగి మంటలు వెలిగించారు. హరిదాసు వేషధారణలో విద్యార్థులు అలరించారు. రంగు రంగుల రంగవల్లులతో,పాఠశాలను అరటాకు తోరణాలతో అలంకరించారు. విద్యార్థులు నృత్యల తో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పద్మశ్రీ,ప్రిన్సిపాల్ ఏదులాపురం దయాకర్,ఉపాధ్యాయ బృందం ,విద్యార్థులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులుగా శ్రీనివాస్.

**సూర్య,రాయికల్**

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ అంబేద్కర్ యువజన సంఘం (మాల) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి ఎన్నికల్లో అధ్యక్షులుగా నీరటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులుగా కంటే నాగభూషణ్,కార్యదర్శిగా బిట్ల కిరణ్ ,కోశాధికారిగా గుండా గంగారం,సహాయ కార్యదర్శిగా వేల్పుల హరీష్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేశానని, అందుకే రెండవసారి కూడ తనను అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. సంఘ అభివృద్ధికి సహాయపడతానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సాయి ప్రగతి విద్యానికేతన్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం బేగంపేట గ్రామం లోని సాయి ప్రగతి విద్యానికేతన్ లో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులలో తయారై వచ్చారు. పాఠశాల ఆవరణలో రంగు, రంగుల ముగ్గులు వేశారు. అదే విధంగా సంక్రాంతి పండుగ యొక్క విశిష్టత లో భాగంగా భోగి మంటలు వేసి, వాటి చుట్టూ పిల్లలు ఆడి పాడారు. నర్సరీ పిల్లలకు భోగి పళ్ళ స్నానం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రశాంతి, డైరెక్టర్స్ శ్రీనివాస్, శ్రీధర్ బాబు, అనిల్ కుమార్ రెడ్డి, రంజిత్ రెడ్డి మరియు ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



వడ్డెర కులస్తుల ఆరోగ్య దైవం ఆరాధ్య దైవం ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 217 వ జయంతి వేడుకలను సిరిసిల్లలో ఘనంగా నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లపు లక్ష్మణ్ మాట్లాడుతూ స్వాతం త్ర ఉద్యమంలో తనదైన పాత్ర పోషించారని అప్పటి కాకతీయ సామ్రాజ్యంలో సైరా నరసింహా రెడ్డి వద్ద సర్వ సైన్యాధిపతి గా పని చేశాడని గుర్తు చేశారు. ఆయనను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోరుదల అంజయ్య,జిల్లా ఉపాధ్యక్షుడు దండు గుల,గొల్లం నర్సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫీట్ల బాబు, వంశీకృష్ణ, కార్యదర్శి శివరాత్రి అయిల య్య,లీగల్ అడ్వైజర్ బోదాసు రమేష్, కోశాధికారి సూర ప్రశాంత్,ప్రచార కార్యదర్శి దండ్ల సురేష్, జిల్లా నాయకులు దండుగుల నాంపల్లి,దండుగుల చిన్న శంకర్,13 మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

**సూర్య వీర్నపల్లి**

వీర్నపల్లి మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అధ్యక్షులు నరేష్ మాట్లాడుతూ పాడి పంటలు సమృద్ధిగా పండాలని పిల్లా పాపలు పాడిపంటలతో చల్లగా ఉండాలని మైసమ్మ తల్లికి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జక్కుల నరేష్, కార్యదర్శి అబ్బనవేని తిరుపతి, సభ్యులు భూక్య రమేష్, మద్దివేణి లక్ష్మణ్, చింతల చిరంజీవి, భూక్య సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ఐ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు

**సూర్య వీర్నపల్లి**



వీర్నపల్లి మండలంలోని కంచర్ల ఎక్స్ రోడ్ వద్ద గురువారం సాయంత్రం ఏఎస్ఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరియైన పత్రాలు కలిగి ఉండాలని లేనియెడల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. నెంబర్ ట్యాంపరింగ్, నెంబర్ ప్లేట్ మార్ఫింగ్ లాంటివి చేసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ సత తప్పకుండా ధరించాలని, అతివేగంతో వాహనాలు, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాబు , ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.

**సూర్య ఇబ్రహీంపట్నం**

మండలంలోని గూడూరు వద్ద బుధవారం రాత్రి మల్లాపూర్ మండలం సాతారం నుంచి గోదురు గుండా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ను పట్టుకున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఉమా సాగర్ హెచ్చరించారు

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**సూర్య ఇబ్రహీంపట్నం**



ముందస్తు సంక్రాంతి సంబరాలు మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రంగురంగులతో ముగ్గులు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రజిత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**సూర్య, వీణవంక**



వీణవంక మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన కోలా సంపత్ (28) అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం మృతుడు కమలాపూర్ మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ లో టెక్నికల్ అసిస్టెంట్ గా కాంట్రాక్టు జాబ్ చేసే వాడనీ తెలిపారు. గురువారం ఉదయం 8.40 గంటలకు ముందు జమ్మికుంట – ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య మడిపల్లి కెనాల్ వద్ద గల రైల్వే ట్రాక్ ప్రక్కన తన బైక్ ని పార్కింగ్ చేసి రైల్వే ట్రాక్ పైకి వెళ్లి రైలు కింద పడి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతునికి ఆర్థిక ఇబ్బందులు అనారోగ్యం వలన ఏదో ట్రైన్ కింద పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య నాగమణి ఒక కూతురు ఉన్నారు. మృతుని భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు.

## సత్యనారాయణకి హిందీ గౌరవ సమ్మన్ పురస్కారం

**సూర్య, మెట్ పల్లి టౌన్**



పట్టణానికి చెందిన హిందీ ఉపాధ్యాయులు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ మరియు జిల్లా అధ్యక్షులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సోషల్ ప్రైడ్ అవార్డు గ్రహీత అల్లకట్టు సత్యనారాయణ కి గురువారము హిందీ భాష అభివృద్ధికై కృషి చేసినందుకు ప్రపంచ హిందీ దినోత్సవం సందర్భంగా అంతర్ రాష్ట్రీయ హిందీ గౌరవ సమ్మాన్ 2024 పురస్కారం అందచేశారు. ఈ సందర్భంగా ఆర్.యు.పిపి రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగందుల రాజేంద్ర ప్రసాద్, భార్తల రాజసాగర్, కొండబత్తిని రమేష్, మద్దెనపల్లి లక్ష్మణ్, సంజీవ్ పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ అభినందనలు తెలియజేశారు.

## దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

**- ఎస్సై పాకాల లక్ష్మణ్ రెడ్డి**

**సూర్య శంకరపట్నం**



శంకరపట్నం మండల కేశవపట్నం గ్రామంలో బుధవారం నాడు రాత్రి నాంపల్లి శివాజీ అనే యువకుడిపై బీహార్ కు చెందిన ఇద్దరు వ్యక్తులు గుడ్డ రాము,రాహుల్ రాముకుమార్ లు బీర్ సీసాతో దాడికి పాల్పడ్డారు. అది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు,108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఈఎంటి సతీష్ రెడ్డి,పైలెట్ ఖలీల్ ఖాజా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. శివాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేశవపట్నం ఎస్ఐ లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రైస్ మిల్లును సందర్శించిన అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్.

**సూర్య ఇల్లందకుంట**

కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తన విధి నిర్వహణలో భాగంగా గురువారం ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో గల రైస్ మిల్లును సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తాసిల్దార్ రాణి, గిరిధర్ రవి తదితరులు ఉన్నారు.



### సిఐటియు కృషి ఫలితంగా...

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ అమలు ప్రక్రియ ప్రారంభం

**-సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన ఇఎస్ఐ బృందం -సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్గూరి మధు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) చేసిన కృషి ఫలితంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించే కృషి ప్రారంభమైందని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్గూరి మధు తెలియజేశారు. గురువారం హైదరాబాద్ ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం అధికారి టి. ప్రశాంత్, వరంగల్ బ్రాంచ్ మేనేజర్ జి. సాయిల బృందం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి సింగరేణి వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికుల వివరాలను సేకరించారు. సింగరేణి డిప్యూటీ జనరల్ మేనేజర్ పర్సనల్ డి. వరప్రసాద్, ఇతర పర్సనల్ అధికారులతో చర్చించారు. కొత్తగూడెం పర్యటనకు వచ్చిన ఈఎస్ఐ బృందాన్ని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ప్రతినిధి బృందం కలిసి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషిని ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలియజేసింది. సాధ్యమైనంత తొందరగా విచారణను పూర్తి చేసి కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ మంజూరు చేసి ఈఎస్ఐ వైద్య సదుపాయాన్ని అందించాలని ఆయనకు వారు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతినిధి బృందంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బల్గూరి మధు, కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి డి. వీరన్న, బ్రాంచ్ అధ్యక్షులు జి. శ్యామ్‌కుమార్, తాజుద్దీన్, శ్రీను, పవన్ తదితరులు ఉన్నారు.



**సిఐటియు చేసిన కృషి ఫలితమే:-**

2022 సెప్టెంబర్‌లో జరిగిన 18 రోజుల సమ్మె సందర్భంగా సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలతో చేసిన ఒప్పందంలో ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించేందుకు అంగీకరించింది. దీనివల్ల కోసం సింగరేణి డైరెక్టర్ (పా)ను అనేకసార్లు కలిసి ఒత్తిడి తేవడం జరిగింది. ఫలితంగా సింగరేణి యాజమాన్యం 26.11.2022న ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌కి లేఖను రాసింది. ఈఎస్ఐ రీజినల్ అధికారులు సింగరేణిలో ఈఎస్ఐ అమలుకు అనుమతి కోరుతూ ఢీల్లి కి లేఖ రాశారు. 2023 జూన్ 13న సింగరేణి ఎన్నికల నిమిత్తం సెంట్రల్ లేబర్ అధికారులు నిర్వహించిన మీటింగ్ వద్ద ధర్నా నిర్వహించిన సందర్భంగా నాటి డైరెక్టర్, నేటి సిఅండ్ఎండి ఎన్. బలరాం నాయక్ జోక్యం చేసుకుని స్వయంగా ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడటం జరిగింది. సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ఒకపక్క సింగరేణి అధికారులను, డైరెక్టర్‌ను కలుస్తూ వినపత్రాలు ఇస్తూనే, మరోపక్క ఈఎస్ఐ అధికారులను కలిసి ఒత్తిడి చేసింది. 26.09. 2023వ తేదీన, 03.11.2023 వ తేదీన, 14.11.2023 వ తేదీన, 19.12.2023వ తేదీన నాలుగు సార్లు హైదరాబాదులోని ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో అధికారులను కలిసి వారితో చర్చించి వారిపై ఒత్తిడి తెచ్చింది. ఢిల్లీ లో ఫైల్ పెండింగ్ లో వుందని తెలియ డంతో ఈఎస్ఐ అధికారులతో కూడా సిఐటియు నాయకులు మాట్లా డారు. సిఐటియు జాతీయ కార్యదర్శి, ఈఎస్ఐ బోర్డు మెంబర్ ప్రశాంత్ నంది చౌదరి తేది:14.11. 2023న ఈఎస్ఐ అధికారులకు లేఖ రాసి వారితో చర్చించారు. డిసెంబర్‌లోను వారితో మాట్లాడారు. ఫలితంగా ఈఎస్ఐ ఢిల్లీ కార్యాలయం నుండి అనుమతి లభించింది. అను మతి వచ్చిన వెంటనే హైదరాబాదులోని రీజినల్ డైరెక్టర్ కార్యాలయం నుండి ఈ పని కోసం అధికారిని కేటాయించి పని ప్రారంభించారు.

**అధికారులకు ధన్యవాదాలు:-**

సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కల్పించడానికి అంగీకరించి దాని అమలు కోసం వ్యక్తిగతంగా ప్రత్యేక శ్రద్ధను పెట్టి కృషిచేసిన నాటి డైరెక్టర్ (పా), నేటి సిఎండి ఎం. బలరాం నాయక్ కి, దీని కోసం కృషి చేసిన జనరల్ మేనేజర్ పర్సనల్ మరియు ఇతర పర్సనల్ అధికారులందరికీ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సిఐటియు) ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసింది. ఈఎస్ఐ అమలు చేసేందుకు కృషి చేసిన ఈఎస్ఐ బోర్డు మెంబర్, సిఐటియు జాతీయ ప్రధాన జాతీయ కార్యదర్శి ప్రశాంత్ నంది చౌదరి మరియు ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం హైదరాబాద్ అధికారుల ందరికీ కృతజ్ఞతలు తెలియచేసారు.

## సిఎంఆర్ బియ్యం త్వరగా చెల్లించాలి

**- జేసి లక్ష్మి కిరణ్**

**సూర్య జమ్మికుంట**



కస్టమ్ మిల్లింగ్ బియ్యం త్వరగా పెట్టాలని కరీంనగర్ జేసి లక్ష్మి కిరణ్ అన్నారు. గురువారం పట్టణంలోని సప్తగిరి రైస్ మిల్లు తనిఖీ చేశారు. నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఆనంతరం ఎఫ్ సిఐ గోదాములను పరిశీలించారు. మిల్లర్ల నుండి వచ్చే బియ్యంకు గోదాముల్లో సరిపడ స్థలం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్బంగా జేసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30వరకు గడువు పెట్టిందని, సిఎం ఆర్ పెండింగ్ ఉన్న మిల్లర్లు గడువులోగా ఎఫ్ సిఐకి అందజేయాలని సూచించారు. ఎవరైన వివిధ కారణాలతో లేవి బియ్యం పెట్టని ఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం విధించిన గడువు వరకు పొడగించకుండా 21లోపు పూర్తి అయ్యేలా చూడాలని మిల్లర్లకు సూచించారు. నిబంధనల ప్రకారం బియ్యం ఉంటేనే ఎఫ్ సిఐ అధికారులు అనుమతించాలన్నారు. ఆమె వెంట హుజూరాబాద్ ఆర్డీవో సోలిపురం రాజిరెడ్డి, ఎమ్మార్వో రజనిరెడ్డి, ఆర్ ఐ సందీప్, తదితరులు ఉన్నారు.

## నక్సలైట్ల పేరుతో బెదిరింపులు..

**బాధితుడి ఫిర్యాదుతో రిమాండ్**

**సూర్య వేములవాడ టౌన్**

నక్సలైట్లమని బెదిరించిన వ్యక్తుల పై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు పోలీసులు. వివరాలలోకి వెళితే శాలరమన్నపల్లీ గ్రామ%శీ% నాంపల్లి శివారుల్లో అదే గ్రామానికి చెందిన వ్యక్తి భూమి లోని సగం భూమిని మానుక కుంటయ్య, పట్టే మల్లేశం, బులగం మల్లేశం, లు తాము నక్సలైట్ల మని భూమిని తమకు రిజిస్ట్రేషన్ చేయకపోతే చంపేస్తామని బెదిరించగా వెంటనే బాధితుడు పోలీసులను ఆశ్రయించగా గురువారం నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు సిఐ కరుణాకర్ తెలిపారు.

## జేఎన్టీయూలో నిర్వహించే సెమినార్ ను సద్వినియోగం చేసుకోవాలి

**సూర్య, సెంటినరీ కాలనీ**



మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మైనింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో కోల్ మైనింగ్ భవిష్యత్తుపై ఒక రోజు సెమినార్ ను ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నారు. అదే రోజు మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్ ను ప్రారంభిస్తున్నారు. సెమినార్ బ్రోచర్ ను గురువారం కళాశాల ఆవరణలో చైర్మన్, ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్ రెడ్డి ఆవిష్కరించారు. కో చైర్మన్ గా సిహెచ్ ఎస్ఎన్ మూర్తి, కన్వీనర్లుగా ఆర్.దుర్గారావ్, ఎస్.శ్రీనివాసులు, జగన్నాధ జెట్టి ఉన్నారు. సెమినార్ ను సింగరేణి సంస్థ డైరెక్టర్ (పిపి) వెంకటేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా, నలుగురు జిఎంలు అతిథులుగా హాజరై ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ డిపార్ట్మెంట్ అధిపతి సిహెచ్.మూర్తి, జగన్నాధ జెట్టి, యు.ఎలియాజర్, ఎన్.హిరణ్మయి, ఎం.బాంధవి, ఫిజికల్ డైరెక్టర్ పింగళి కృష్ణారెడ్డి, స్టూడెంట్ కోఆర్డినేటర్లు ఎం.సాయిదీక్షిత్, ఎం. అనూష, వి.పవన్ కుమార్, ఎ.రతిన్, మైనింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ముందస్తుగా మకర సంక్రాంతి వేడుకలు

**సూర్య,రాయికల్6**

రాయికల్ పట్టణ లోని ప్రగతి,విశ్వశాంతి వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో, అలాగే ఆలూరు రామాంజిపేట్ ఇటిక్యాల ప్రభుత్వ పాఠశాలలో ముందస్తుగా మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మన పండుగ- మన సంస్కృతి కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు ముందస్తు మకర సంక్రాంతి వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు.పాఠశాల ప్రాంగణాలను రంగవల్లికలతో ముస్తాబు చేసి,పండగ వాతావరణం ఉట్టిపడి విధంగా,హరిదాసుల వేషదారులతో,గంగిరెద్దుల విన్యాసాలతో, అమ్మవారి ఫోటోను అలంకరించి, బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు.భోగి మంటలు,పాలను పొంగించడం వంటివి ఆకట్టుకున్నాయి.అమ్మాయిలకు భోగి పండ్లను తలపై పోశారు.అమ్మాయిలు హరిదాసులకు బియ్యాన్ని పోయడం,భోగిమంటల చుట్టూ ఆరో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థినిలు కోలాటం ఆడుతూ సంక్రాంతి పాటలకు నృత్యాలు చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మకర సంక్రాంతి పండగ ప్రతి ఒక్కరికి శుభాలను కలిగించాలని,భోగి భాగ్యాలతో విలసిల్లాలని, అష్టైశ్వర్యాలు కలగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్లు బాలె జయశ్రీ శేఖర్, మచ్చ గంగాధర్ లలిత,కైరం సత్యం గౌడ్,అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, విద్యాన్వేష్, ఉపాధ్యాయ బృందము,స్కాట్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి మేలని,రోగ నిరోధక శక్తిని పెంచే మిల్లెట్ ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని రికార్డ్ సర్వీస్ సొసైటీ సభ్యులు శ్యామల పిలుపునిచ్చారు.గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 29వ వార్డు శివనగర్ లో వార్డు కౌన్సిలర్ గెంటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలకు చిరు ధాన్యాల వంటకాలు,పిండి వంటల తయారీపై రికార్డ్ సేవా సంస్థ వారు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు శ్యామల మాట్లాడుతూ అత్యంత పోషక విలువలు కలిగి రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారం చిరుధాన్యాల ఆహార మని అన్నారు.ప్రతి ఇంటిలో చిన్న నుండి మొదలు కొని వృద్ధుల వరకు చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని పిలుపుని చ్చారు. చిరుధాన్యాలతో ఏ విధంగా వంటలు చేయాలో చేసి చూపించారు.ఈ కార్యక్రమం లో సొసైటీ అధ్యక్షులు కుసుమ సురేష్, ఆర్టిఐ అండ్ హ్యూమన్ రైట్స్ అడ్వకేట్ సొసైటీ టీమ్ మెంబర్ అలేఖ్య గౌడ్, సుమలత,యమునా, విజయ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించాలి

**సూర్య సిరిసిల్ల టౌన్**



11వ పిఆర్సి ప్రకారం పెరిగిన వేతనాలను మున్సిపల్ కార్మికులకు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ప్రభుత్వాన్ని కోరారు.ఈరోజు సిరిసిల్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్ లో పనిచేస్తున్నటువంటి నెలవారి కూలీలకు పది నెలల వేతనాలు చెల్లించాలని,11వ పిఆర్సి ప్రకారం పెరిగినటువంటి వేతనాలను సిరిసిల్లాలో రెండు నెలలు మాత్రమే ఇచ్చారని, మిగతా ఆరు నెలల ఏరియల్ వేతనాలను చెల్లించలేదని అన్నారు.సిరిసిల్ల మున్సిపాలిటీలో కాంట్రాక్టు బేసిక్ లో పనిచేస్తున్న కార్మికులకు నెల నెల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం సమాన పనికి సమాన వేతనం అన్న రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం కనీస వేతనం 26,000 ప్రతి కార్మికునికి చెల్లించాలని డిమాండ్ చేశారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ లో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తించాలని డిమాండ్ చేశారు.ఈ సమా వేశం లో ఏఐటీయూసీ నాయకులు అజ్జు వేణు,నల్ల చంద్ర మౌళి,పంతం రవి,సోమ నాగరాజు పాల్గొన్నారు.

## ముందస్తు ముగ్గుల సంక్రాంతి వేడుకలు

**సూర్య, మెట్ పల్లి టౌన్**



పట్టణంలోని సూర్యోదయ హైస్కూల్లో గురువారము ముందస్తు ముగ్గుల సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగవల్లి పోటీలను నిర్వహించారు. విద్యార్థినిలు ఎంతో ఆసక్తితో పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థినిలకు ఉత్సాహ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ దోంతుల రాజకుమార్, డైరెక్టర్ చర్లపల్లి రాజేశ్వర్ గౌడ్, ప్రిన్సిపల్ విజయకుమారి మరియూ ఉపాధ్యాయని, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు. అనంతరం పన్నెండవ వార్డులో గల బ్రూక్లిన్ హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగులతో ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థిని లకు మొదటి, రెండవ, మూడో బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు అందరు కలసి వివిధ పాటలపై నృత్యాలు చేశారు. అనంతరం భోగి మంటలు కాల్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బుర్ర ప్రసాద్ గౌడ్, జయలక్ష్మి , పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## మొక్కులు చెల్లించుకున్న దుద్దిల్ల వీరాభిమాని

**సూర్య ముత్తారం**



ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, శ్రీధర్ బాబు వీరాభిమాని, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య ఐటీ పరిశ్రమల శాఖ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గెలుపు కోసం కష్టపడి శ్రీధర్ బాబును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మొక్కుకున్న మద్దెల రాజయ్య శ్రీధర్ బాబు గెలుపొందడంతో మొక్కుకున్న మొక్కులు తీర్చడం కొరకు శ్రీ రాజరాజేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించుకునేందుకు కాలినడకన సోమవారం ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని తన గృహం నుండి బయలుదేరి గురువారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ సన్నిధికి చేరుకొని తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

మహనీయులు వడ్డే ఓబన్న జీవితం మనకు స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్లు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా వడ్డే ఓబన్న నిర్వహించిన పాత్ర,



ఆయన జీవిత చరిత్రను జిల్లా వెనుకబడి తరగతుల అధికారి చదివి వినిపించారు. వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, ఆయన అందించిన స్ఫూర్తిని మనమందరం స్మరించుకోవాలని అన్నారు. అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, వారి జీవితం మనందరికీ ఆదర్శమని, వారి విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం మనమంతా కృషి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి జే.రంగారెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్, వడ్డెర సంఘం జిల్లా వైస్ చైర్మన్ కుంట పోశెట్టి, జిల్లా కార్యదర్శి వోళ్ళేపు బాలకృష్ణ, పట్టణ ప్రెసిడెంట్ కొట్టే సమ్మయ్య, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ బి.సి సంఘ నాయకులు, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పటిష్ట చర్యలు చేపట్టాలి. - డి టి ఎఫ్

**సూర్య, ఇల్లందకుంట**

ఇల్లందకుంట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో గురువారం డెమొక్రటిక్ టీచర్స్ పెడరేషన్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ను డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని, ఉపాధ్యాయుల కోర్ట్ కేసులను పరిష్కరించి పదోన్నతులు బదిలీలు చేపట్టాలని, పాఠశాల ల్లో ఉన్న ఖాళీ పోస్టులకు డీఎస్సీ నిర్వహించాలని, ప్రాథమిక పాఠశాలల్లో కనీసం సబ్జెక్టు కు ఒక ఉపాధ్యాయున్నీ కేటాయిచాలని, పెండింగులో ఉన్న మూడు డీఏ లను,పీఆర్సీ ఏరియర్స్ ను, జీపీఎఫ్ లోన్స్ ను,మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని,పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పీ. ఈశ్వర్ రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.సంపత్,మండల అధ్యక్షులు చిటికెన వేణు,నాయకులు సమ్మిరెడ్డి, వెంకట్రాజం, వీరస్వామి, ఐలయ్య, రామ్మూర్తి,రత్నం, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య,ఉపాధ్యాయులు నాగరాజు, రాజు, మల్లయ్య, శ్రీదేవి, అన్నపూర్ణ,తిరుపతి, అఫ్జల్ పాల్గొన్నారు.

## బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కిసాన్ మోర్చా నేతలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ బండి సంజయ్ కుమార్ ఇటీవల జాతీయ కిసాన్ మోర్చా ఇన్చార్జిగా (ప్రబారి) నియమితులైన సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు అన్నాడి రాజిరెడ్డి ఆధ్వర్యంలో కిసాన్ మోర్చా నేతలు గురువారం బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చనేత లతో బండి సంజయ్ కుమార్ పలు విషయాలపై చర్చించారు. అలాగే బిజెపి మోడీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమం అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలను, రైతాంగానికి అండగా నిలుస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఎప్పటికప్పుడు రైతాంగానికి తెలియజేయాలని బండి సంజయ్ ఈ సందర్భంగా కిసాన్ మోర్చా నేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చ కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ మోతె గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరడి శివా రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి రమణా రెడ్డి, కాల్వ పూర్ణచందర్ రెడ్డి, బోడ భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మందా దేవేందర్, ఈస్ట్ జోన్ కిసాన్ మోర్చా అధ్యక్షులు మాచర్ల కోటేశ్వర్ మరియు నాయకులు తోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**సూర్య మల్యాల**

తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, నూకపల్లిలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 100 సీట్లకు ప్రవేశం పొందడానికి తాము 7వ నుండి 10వ తరగతులలో మిగిలిన సీట్లకు ప్రవేశం పొందడానికి ఈ నెల 12వ తేదీ నుంచి ఫిబ్రవరి 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మల్యాల మండల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డి. సరితాదేవి తెలిపారు. దరఖాస్తు చేసుకోను విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.telanganams.cgg.gov.in ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు %జుఔ% విద్యార్థులు రూ.125, ఇతరులు రూ. 200 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు ఏప్రిల్ 7వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుండి 12గంటల వరకు మరియు 7వ నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లకు ఏప్రిల్ 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.ఏప్రిల్ 1వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. మోడల్ స్కూళ్లలో సీట్లు లభించే విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదువు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం యూనిఫారాలు వంటి సదుపాయాలు ఉంటాయని తెలిపారు. కాగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు కళాశాలలో దరఖాస్తు కాపీ, ఆధార్ కాపీ, కులము కాపీ, ఆదాయ ధ్రువీకరణ జిరాక్స్ కాపీలతో పాటు ఒక పాస్ పోర్ట్ సైజు ఫొటోను ఇచ్చి పేరును నమోదు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సరితాదేవి తెలిపారు.

## మహిళల అభివృద్ధిరక్షణ పై అవగాహన.

**సూర్య,ఇల్లంతకుంట**



మహిళల అభివృద్ధి వారి రక్షణ పై విద్యార్థులకు మహిళ సాధికారిక జిల్లా కో ఆర్డినేటర్ రోజా అన్నారు. గురువారం మండల కేంద్రం లోని హైస్కూల్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల యొక్క అభివృద్ధి రక్షణపై, ఫోక్సో చట్టం గురించి ఆడపిల్లలను ఎవరైనా వేధించినట్లయితే వారి పైన చట్ట రీత్యా శిక్షించబడుతారున్నారు. హెల్ప్ లైన్స్,చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ నెంబర్ 1098,181 సఖి కేంద్రం మహిళలకు అందిస్తున్నటువంటి వైద్య, న్యాయ, కౌన్సిలింగ్ ,పోలీస్ ,షెల్టర్ వంటి ఉచిత సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్ చంద్రకళ,మహిళ సాధికారిక కౌన్సిలర్ దేవిక, హెచ్ ఎం ప్రేమ లత,ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీ బియ్యం లో చెత్తాచెదారం

**సూర్య, రాయికల్**



ప్రభుత్వం ప్రజలకు అందజేసే ప్రజా పంపిణీ బియ్యం లో చెత్తాచెదారం తోపాటు రంగురంగుల చమికీలు,ఇసుక రావడంతో ప్రజలు అవాక్కైన సంఘటన రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో చోటుచేసుకుంది.రేషన్ బియ్యం పంపిణీ లో భాగంగా గ్రామంలోని ఓ రేషన్ డీలర్ బియ్యం ప్రజలకు అందించేందుకు బస్తాలను విప్పి చూడగా బియ్యం లో చెత్త చెదారంతోపాటు రంగురంగుల చెమికీలు ఇసుక తారస పడడంతో ప్రజలందరూ అవాక్కయ్యారు.ఇట్టి బియ్యం ధర్మపురి మండలం లోని రాయపట్నం గ్రామంలో గల శ్రీ సత్యనారాయణ స్వామి రైస్ మిల్ నుండి నేరుగా రేషన్ దుకాణంకు వచ్చినట్లు సమాచారం.ఇట్టి రేషన్ బియ్యం పై సంబంధిత అధికారులు విచారణ జరిపి,మరోసారి ఇలాంటి చెత్తాచెదారం బియ్యం రాకుండా చూడాలని,ఇట్టి బియ్యాన్ని సరఫరా చేసిన సంబంధిత మిల్లు పై సైతం తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**సూర్య, వీణవంక**



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టుకున్న సంఘటన వీణవంక మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌ను ఇసుక రవాణాకు ఏమైనా అనుమతి పత్రాలు ఉన్నాయా....? అని ఎస్ఐ వంశీకృష్ణ ప్రశ్నించగా ఏమి లేవని బదులిచ్చాడు. దొంగతనంగా మల్లారెడ్డిపల్లి మానేరు వాగులో నుండి తీసుకొని పోయి అమ్మికుంటున్నానని చెప్పగా ఆ ట్రాక్టర్, డ్రైవర్ ను పోలీసు స్టేషన్ కు తీసుకొని వచ్చి డ్రైవర్ రాయనవేని హరీష్, ఓనర్ రాయనవేని సంపత్‌ల పైన కేసు నమోదు చేయనైనదని ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలో గల గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు ఎవ్వరైనా అక్రమ ఇసుక రవాణా చేసిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడునని ఎస్ఐ తెలిపారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పరిశీలించిన అధికారులు

**సూర్య,రాయికల్**



మండలంలోని జగన్నాథ్ పూర్ గ్రామంలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెకులను సంబంధిత జిల్లా అధికా రులు గురు వారం సందర్శించారు లిఫ్ట్ ఇరిగేషన్ పంపు హౌచిస్ లను సంబంధిత శాఖ ఎస్.ఈ. అశోక్ కుమార్ పరిశీలించి, రైతులకు ఉపయోగ పడేలా మరమ్మతు చర్యలు చేపట్టాలని,వాటికి అయ్యే ఖర్చు విలువ తెలుసుకొని త్వరగా రైతులకు వినియోగంలోకి తీసుకరావాలని సంబంధిత అధికారి డి ఈ భాస్కర్ ను సూచించారు.వారి వెంట ఈఈ. నారాయణ రెడ్డి,డి ఈ.మహేష్ చందర్ రావ్, ఐ డి సి.ధనుంజయ్, లక్ష్మణ్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు పరాచ శంకర్,ఆత్రం భగవంత్ రావ్,మాజీ సర్పంచ్. సిడం భీమ్,పెందూర్ మారుతి,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వాణీనికేతన్ హైస్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు.

**సూర్య,ఇల్లంతకుంట**



మండలకేటంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో బోగిమంటలను ఏర్పాటు చేశారు. గాలిపటాలను ఎగురవేశారు. విద్యార్థినీలకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా కరస్పాండ్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లా డుతూ విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయలపై అవగాహన కల్పించా లనే లక్ష్యంతో వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిసంవత్సరం వినూత్న కార్యక్రమాలు పాఠశాలలో ఏర్పాటు చేస్తుండటం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాద్యాయులు శ్రీనివాస్, మల్లేశం, రాజు, రమేష్, సంతోష్, రాజు,శోభ, సుమంగళి, రేఖ, రేవతి, లావణ్య, మహలక్ష్మి,మౌణిక. సునంద, స్వాతి, మౌణిక. కళ్యాణి, షమీ మలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## అపర భద్రాద్రిలో కన్నుల పండుగ గా కూడర్రై ఉత్సవం

**సూర్య, ఇల్లందకుంట**



ధనుర్మాసం ముక్కోటి ఉత్సవములలో భాగంగా గురువారం అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో కూడర్రై ఉత్సవము అమ్మవారి నోము కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి మరియు గోదా అమ్మవారికి అభిషేకములు అర్చనలు జరిపిన పిదప అమ్మవారి నోము కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశామని ఆలయ కార్య నిర్వహణ అధికారి కే. సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## 12 నుండి 17 వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జనవరి 12 నుండి 17 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించడం జరిగిందని, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం ప్రభుత్వం ప్రకటించిన విధంగా తమ పాఠశాలల్లో విధిగా సెలవులు ప్రకటించాలని జిల్లా విద్యా శాఖ అధికారి డి. మాధవి గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించి సంక్రాంతి సెలవులలో ఏదేని పాఠశాల నడిపిస్తున్నట్లు దృష్టికి వచ్చినట్లయితే, ఉపాధ్యాయులను పాఠశాలకు రమ్మని ఒత్తిడి చేసినట్లయితే అట్టి పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకొని, అట్టి పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.

# తెలంగాణలోనే అతిపెద్ద డ్రైవింగ్ స్కూల్ మండేపల్లి టైడ్స్

- అంతర్జాతీయ ప్రమాణాలతో తర్ఫీదు. - డ్రైవింగ్ శిక్షణ తో పాటు మెకానికల్ నాలెడ్జ్ పై అవగాహన

- టైడ్స్ అందించే శిక్షణను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - టైడ్స్ ప్రిన్సిపల్ కె.బూవరాఘవన్,జిల్లా రవాణా అధికారి కొండల్ రావు

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

సిరిసిల్ల పట్టణం సమీపంలోని మండేపల్లి లో ఏర్పాటు చేసిన తెలంగాణలోనే అతిపెద్ద డ్రైవింగ్ స్కూల్ టైడ్స్ (తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఏడ్యుకేషన్ అండ్ స్కిల్స్)లో డ్రైవింగ్‌లో అంతర్జా తీయ ప్రమాణాలతో తర్ఫీదు ఇస్తున్నందున ప్రజలందరూ సద్వినియోగం చేసు కోవాలని టైడ్స్ ప్రిన్సిపల్ కె.బూవరాఘవన్, జిల్లా రవాణా అధికారి కొండల్ రావు అన్నారు. ఇక్కడ డ్రైవింగ్ శిక్షణ తో పాటు మెకానికల్ నాలెడ్జ్ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం ప్రభుత్వం ఈ నెల 15 వ తేదీ నుంచి ఫిబ్రవరి 14 వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం గా ప్రకటించిన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మండేపల్లి టైడ్స్ లో రహదారి భద్రత పై అవగాహన కార్యక్రమాలతో పాటు టైడ్స్ ద్వారా ఇప్పటి వరకూ చేపట్టిన, ప్రస్తుతం చేపడుతున్న కార్యకలాపాలు, రహదారి భద్రత లో టైడ్స్ పాత్రను క్షేత్ర పరిశీలనకు వచ్చిన పాత్రికేయులకు సంస్థ ప్రిన్సిపల్ కె . బూవరాఘవన్, జిల్లా రవాణా అధికారి కొండల్ రావు వివరించారు.భారత దేశంలో ఏటా 4 ,50,000 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని టైడ్స్ ప్రిన్సిపల్ కె . బూవరాఘవన్, జిల్లా రవాణా అధికారి కొండల్ రావు తెలిపారు. ఈ ప్రమాదాల్లో 1,50,000 మంది మరణిస్తున్నారనీ చెప్పారు. ఈ మరణాల్లో సగానికి పైగా యువతనే ఉన్నారని చెప్పారు. దీని వల్ల ఆ కుటుంబాలు అన్ని విధాలుగా తీరని నష్టం వాటిల్లుతుండడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ప్రతికూలంగా మారిందన్నారు. రోడ్డు భద్రత పై అవగాహన లేకపోవడం, సరైన శిక్షణ లేకపోవడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దీనిని





దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అన్ని జిల్లాలోని డ్రైవర్ లకు శిక్షణ ఇచ్చేందుకు సిరిసిల్లలోని మండేపల్లిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , అశోక్ లేల్యాండ్ సంయుక్త ఆధ్వర్యంలో రూ.22 కోట్ల రూపాయలతో టైడ్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఐదు ఎకరాల్లో పరిపాలన, వసతి గృహ భవనాలు, 15 ఎకరాల్లో డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించారనీ చెప్పారు.నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాజన్న సిరిసిల్లలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేసిన డ్రైవింగ్ స్కూల్ అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు మీడియా సహకారం కూడా అవసరమన్నారు. లైట్ మోటార్ వెహికల్, హెవీ మోటార్ వెహికల్, హజార్డిఎస్ హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్, హజార్డియస్ హెవీ మోటార్ వెహికల్ రెన్యువల్ శిక్షణను వరుసగా కాల పరిమితి 21 రోజులు కోర్స్ ఫీజు 7080, 30 రోజులు కోర్స్ ఫీజు 16,520, 3 రోజులు కోర్స్ ఫీ 2250, 1 రోజు కోర్స్ ఫీ 750 తో అందిస్తున్నట్లు తెలిపారు. ఔత్సాహికులకు శిక్షణ తో పాటు భోజన వసతినీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ వివిధ కోర్సుల్లో 4000 మందికి పైగా అభ్యర్థులకు శిక్షణ ఇచ్చామని అన్నారు. 350 మందికి ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు లభించాయని చెప్పారు. ఇక్కడ డ్రైవింగ్ శిక్షణ పొందిన అభ్యర్థులకు దేశ, విదేశాలలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలతో పాటు తెలంగాణ ప్రజలు సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో డ్రైవింగ్ లో శిక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ కార్యకలాపాలను నిర్వాహకులు పాత్రికేయులకు దగ్గరుండి చూపించారు.







## పోలీసుల అవగాహన సదస్సు

**సూర్య, మెట్ పల్లిటౌన్**

పట్టణంలోని చావిడి ఏరియాలో పోలీసుల అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీ.ఎస్పీ వంగ రవీందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళితే పోలీస్ స్టేషన్ లో తెలియపరచాలని సూచించారు. అలాగే నగదు, నగలు గాని ఉంటే బ్యాంకు లాకర్లలో పెట్టుకోవాలని తెలిపారు. అలాగే గల్లీలలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలని అన్నారు. వార్డు సభ్యులందరూ కలిసి ఏరియా పరంగా సీసీటీవీ కెమెరాలు పెట్టుకోవాలని, అలాగే ప్రతి ఇంటిలో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిగా ఉంచాలని చెప్పారు. పిల్లలు గంజాయికి మరియు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని వారిని ఎప్పుడూ ఒక కంట కనిపెడుతూ ఉండాలని సూచించారు. అనంతరం ప్రజాపాలన దరఖాస్తులు అంటూ ఓటిపిలు చెప్పండని, ఏవైనా ఫోన్ కాల్స్ వస్తే వాటిని వెంటనే మాకు తెలియజేయాలని ఎలాంటి ఓటీపీలు ఎవరికీ తెలియజేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ.లక్ష్మీనారాయణ, ఎస్ఐ.చిరంజీవి మరియు వార్డు ప్రజాప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## 31లోగా సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలి..

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ఖరీఫ్ 2022-23 గాను బాకీ ఉన్న సీఎంఆర్ రైస్ డెలివరీని జనవరి 31లోగా తప్పని సరిగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ జిల్లాలోని రైస్ మిల్లర్లు, సంభందిత అధికారులతో ఖరీఫ్ 2022-23 సి.ఎం.ఆర్. రైస్ డెలివరీపై సమీక్షించారు. సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ జనవరి 31 లోగా పూర్తి చేయాలనీ, గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తి చేయాలని అన్నారు. సీ.ఎం.ఆర్.రైస్ డెలివరీలో జాప్యం చేస్తున్న రైస్ మిల్లర్లపై అదనపు కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, మిలర్లు సమయంలోగా బియ్యాన్ని అప్పగించకపోతే వారి వద్ద ఉన్న ధాన్యాన్ని సక్రమంగా మిల్లింగ్ చేసిన రైస్ మిల్లులకు బదిలీ చేసి, జాప్యం చేసిన మిల్లర్లపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డి.టి. సి.ఎస్., రైస్ మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పాత్ర కిలకం

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం భావితరాలకు చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న 217వ జయంతి వేడుకలలో పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంచార జాతికి చెందిన వడ్డే కులంలో సుబ్బన్న సుబ్బమ్మలకు 11 జనవరి,1807లో వడ్డే ఓబన్న జన్మించారన్నారు. స్వతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పాత్రకిలకమని, వారి వీరోచిత పోరాటాల స్ఫూర్తిని భావితరాలకు చాటి చెప్పాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, ఆర్డీఓ మహేశ్వర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు బొంతల సమ్మయ్య, ఉపాధ్యక్షులు చల్ల రాజ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొమ్మరాజుల శ్రీనివాస్, ఓర్సు మురళి, బిక్షపతి వెంకటేష్, బొంత నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో పాత బట్టల సేకరణ

### - సత్మియ

**సూర్య తిమ్మాపూర్ / కరీంనగర్ ప్రతినిధి**

తిమ్మాపూర్ మండలములో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పాత బట్టల సేకరణ – పంపిణీ సత్మియ సెల్ ని శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ కర్రా నరేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఇట్టి సందర్భంగా డైరెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వీకరించిన బట్టలు బీదవాళ్లకు చాలా ఉపయోగపడునని కావున బట్టలను వృధాగా పడవేయకుండా కళాశాలకు తీసుకువచ్చి ఇచ్చినట్లయితే పంపిణీ చేయ బడునని విద్యార్థులకు తెలియజేశారు. అటు తర్వాత ప్రిన్సిపల్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ మూడు రోజులే కాకుండా ఇది నిరంతర ప్రక్రియ అని, ఏ రోజైనా మీరు మానవత దృక్పథంతో బట్టలు తీసుకుని రావచ్చు. ఈ విధంగా సేకరించిన బట్టలను బీదవారికి, అనాథ ఆశ్రమానికి బట్టలు కొనుక్కోలేని స్థితిలో ఉన్న అనాథలకు పంపిణీ చేయడం జరుగుతుంది. కావున మీరందరూ మీకు అవసరం లేని శుభ్రమైన, చినగని బట్టలను కళాశాలలో ఏర్పాటుచేసిన సతియ సెల్ యందు సమర్పించినట్లయితే ఎంతో మందికి మీరు ఉపయోగపడ్డవారైతారని విద్యార్థులకు సూచించారు.అనంతరం డైరెక్టర్ నరేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, పాలనాధికారి పారువెల్ల రామారావు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్స్ ఓ.మధు, డాక్టర్ డి.సతీష్ కుమార్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డబ్బాలలో వారు తీసుకుని వచ్చిన బట్టలను వేశారు.ఇట్టి కార్యక్రమంలో మీడియా ఇంచార్జ్ గొంటి రమేష్, వివిధ విభాగాధిపతులు,అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.






## సమాజసేవలో విద్యార్థులు ముందుండాలి.

### - ఎంపిపి వూట్కూరి వెంకటరమణారెడ్డి.

### -జంగారెడ్డిపల్లే లో ఎన్ఎస్ ఎస్ శిభిరం.

**సూర్య, ఇల్లంతకుంట**



సమాజ సేవకై ప్రతి ఒక్క విద్యార్థి ముందుండాలని ఎంపిపి వూట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలం లోని జంగారెడ్డి పల్లె గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథక పథకం శీతాకాల ప్రత్యేక శిబిరాన్ని ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేసిన సమావేశానికి ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగాఎంపిపి హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చదువు తో పాటు సామాజిక చైతన్య పరిచే కార్యక్రమాల్లో బాగాస్వాములు కావడం ఆనందదాయకం అన్నారు. ప్రజలను చైతన వంతులను చేసే కార్యక్రమాలు చేపట్టే విధంగా ఉండాలన్నారు.గ్రామాల్లో మూఢనమ్మకాలు, ఆ సాంఘిక దురాచారాలు, అంటారానితనం, స్వచ్ఛ భారత్ లాంటి వాటి పై అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ తూముకుంట శ్రీలత నరేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ కుమ్మరవేణి ఎల్లయ్య,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి బి. కుమారస్వామి, సీనియర్ అద్యాపకులు ఎస్ మల్లారెడ్డి, జీవన్ బాబు,లింగమూర్తి,విద్యార్థులు పాల్గొన్నారు.

# స్నేహపూర్వకంగా క్రీడలు నిర్వహించుకోవాలి

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

**సూర్య, చిగురు మామిడి....**



స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు జరుపుకోవాలని చిగురు మామిడి ఎస్ఐ బండి రాజేష్ తెలిపారు. చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామంలో బుధవారం ఆ గ్రామానకి చెందిన వార్డు సభ్యులు కూతురు శ్రీపతి రెడ్డి తండ్రి కీర్తిశేషులు శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థం ఎన్ పీ ఎల్ సీజన్ 4 క్రికెట్ మ్యాచ్ ను ఏర్పాటు చేయగా ఎస్సై రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, యువతను ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ నిత్యం ఫోన్లతో కుస్తీ పడకుండా క్రీడల్లో పాల్గొని మానసికో ల్లాసాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా క్రీడలను శాంతియూత వాతావరణంలో ముగించుకోవాలని ఎస్ఐ కోరారు. బ్యాట్ పట్టి, బౌలింగ్ వేసి క్రీడాకారులను ఎస్సై మరింత ఉత్సాహపరిచారు. క్రికెట్ పోటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ కాంట్రాక్టర్ దేవసాని కిరణ్ కుమార్ రెడ్డి, ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, ఠాగూర్ దిలీప్ సింగ్, కుతురు రంజిత్ రెడ్డి, వార్డు సభ్యులు మాడ శ్రీనివాస్, గూళ్ల రాజు, ఆర్గనైజర్స్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ డాక్టర్ సప్త ఋషి, బత్తిని సురేందర్, బోయిని వేణుగోపాల్, ఠాగూర్ రానా ప్రతాప్ సింగ్, బోయిని సాగర్, ఎర్రోజు చారి, ఠాగూర్ తేజ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ నేత మధుకర్‌కు ఆర్థిక సహాయం

**సూర్య, హుజురాబాద్**



ఇటీవల వివిధ ఆరోగ్య సమస్యలు వచ్చి ఇబ్బంది పడుతూ శస్త్ర చికిత్సలు చేసుకొని విశ్రాంతి తీసుకుంటున్న బోర్నపల్లి కి చెందిన టిఆర్ఎస్ నేత గంట మధుకర్ కు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ఆధ్వర్యంలో గురువారం మధుకర్ కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దాతలు కొరకండ్ల రాజేందర్, జ్యోతిబా పూలే జయంతి కమిటీ గౌరవ అధ్యక్షులు మహమ్మద్ ఖాలీద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఉప్పు శ్రీనివాస్ పటేల్, నాయకులు బొంగొని వెంకటయ్య, మునిగంటి వెంకటేశ్వర్లు, పోస్ట్ మాస్టర్ ఇల్లందుల సమ్మయ్య, రావుల రాజేష్ పాల్గొన్నారు.

## విద్యాసంస్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసం స్థల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు విద్యార్థినిల ఆనం దోత్సాహాల మధ్య సంతోషంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా పాఠశాల ఆవరణలోని మైదానంలో చక్కగా అలుకు చల్లి విద్యార్థినిలు, ఉపాధ్యాయులు ముగ్గులు వేశారు. అందమైన రంగవల్లులతో పాఠశాలకు మరింత శోభ ను ఇచ్చింది. పలు పాఠశాలలో గొబ్బెమ్మలు పెట్టి భోగి మంటలు వేశారు. హరి దాసు వేషధారణ అందరిని అలరించింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు గీతా షాజు, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కిరణ్ కుమార్, రవీందర్ రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి, కోటేశ్వర ప్రసాద్, కామనీ రవీందర్, పిల్లల సతీష్, విన్సెంట్ గోపాల్, నారాయణరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ ఎంవిఐ గా ఈశ్వర్ సింగ్ ఠాకూర్

**సూర్య, హుజురాబాద్:**



హుజురాబాద్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గా గురువారం ఈశ్వర్ సింగ్ ఠాకూర్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం హుజురాబాద్ ఎంవిఐ గా పనిచేసిన సిరాజ్ ఉర్ రహమాన్ పెద్దపల్లికి బదిలీ కావడంతో హుస్నాబాద్ లో పనిచేస్తున్న ఈశ్వర్ సింగ్ ఠాకూర్ హుజురాబాద్ కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.

## భక్తిశ్రద్ధలతో కూడార్రై వేడుకలు

**సూర్య, హుజురాబాద్**



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం హుజురాబాద్ పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, కేసీ క్యాంపు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో కూడార్రై ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో భక్తులు జరుపుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా గోదా అమ్మవారు రంగనాథ స్వామి కి పూజలు చేస్తున్న 27వ రోజు జరుపుకునే కుడార్రై కార్యక్రమాన్ని దేవాలయంలో తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసి క్యాంపు వెంకటేశ్వర స్వామి ఆలయ పూజారి నందకిషోరాచార్యులు, రామాలయ పూజారి శ్రీధర్ ఆచార్యులు, ధర్మకర్త క్యాస చక్రధర్, అరుణ్ కుమార్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## గడువులోగా బియ్యం అప్పగించండి

**- లేకుంటే చర్యలు తప్పవు**

**- రైస్ మిల్లర్లకు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష కఠిన హెచ్చరిక**

**సూర్య, జగిత్యాల ప్రతినిధి**



ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోగా అప్పగించాల్సిన బియ్యాన్ని రైస్ మిల్లర్లు వెంటనే అప్పగించాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష రైస్ మిల్లర్లను ఘాటుగా హెచ్చరించారు. గత సంవత్సరం తీసుకున్నటువంటి ధాన్యానికి సంబంధించి ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ను రైస్ మిల్లర్లు అందించేలా అధికారులు చర్యలు తీసుకొని రోజువారీగా డెలివరీ చేయిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు బిఎస్ లత, పౌరసరఫరాల అధికారి, గిడ్డంగుల సంస్థ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్ డ్యాం నిర్మాణం కోసం పరిశీలించిన ఈ ఈ.

**సూర్య, ఇబ్రహీంపట్నం**



మండలంలోని వేముల కుర్తి శివారులో రాట్నాల మడుగు వద్ద గోదావరిపై చెక్ డాం నిర్మాణం కోసం ఇరిగేషన్ ఈ ఈ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు నిర్మాణం అయితే సాగునీరు అందుతుందని గత నెల 29న గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెంటలింభాద్రి హైదరాబాదులోని ప్రజా భవన్లో ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు పై అధికారులు ఆదేశం మేరకు ఈ ఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డి ఈ దేవానంద్ ఏఈ సుకన్య వర్క్ ఇన్స్పెక్టర్ గంగాధర్ నాయకులు పెంట లింబాద్రి శెట్టి రాజారెడ్డి రైతులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**సూర్య, వీణవంక**



ఇటీవల తాడిచెట్టు పై నుండి పడి మృతి చెందిన, గాయపడిన కుటుంబాలను సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ పరామర్శించారు. వీణవంక మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల చందర్ తాటి చెట్టు పై నుండి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి పెద్దమనసును చాటుకున్నాడు. అలాగే గాయపడిన ఉయ్యాల ఎల్లన్న, పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం సేఫ్టీ మోకులు అందించి ప్రమాదాల బారిన పడకుండా కాపాడాలని కోరారు. ఆయన వెంట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొంగోనీ పెద్ద రాజయ్య, ప్రధాన కార్యదర్శి పల్లెర్ల కొమరయ్య, మండల అధ్యక్షుడు దొమ్మటి రాయమల్లు, బొంగోని ఎల్లయ్య, గట్టు కుమార్, పైడిమల్ల సమ్మయ్య, చింతల సుమన్, విజయ్ పాల్గొన్నారు.

## ప్రజా పాలన డాటా ఎంట్రీ పరిశీలన

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లి మండల పరిషత్ సమావేశమందిరంలో జరుగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ ముమ్మరంగా కొనసాగుతోంది. డాటా ఎంట్రీ తీరును ప్రజాపాలన మండల ప్రత్యేకాధికారి ముదుసూధన్ శర్మ, ఎంపిడిఓ రాజు, ఎంపిఓ సుదర్శన్ గురువారం పరిశీలించారు. మండలంలో 20320 దరఖాస్తులు రాగా ఆన్ లైన్ చేస్తున్నారు. దరఖాస్తుల ఆన్ లైన్ ప్రక్రియ పెద్దపల్లి మండలంలో చివరి దశకు చేరింది. గడువుకు ముందే డాటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేసేలా వారు ప్రత్యేక కృషి చేశారు

## స్వచ్ఛ సర్వేక్షన్ లో రాయికల్ పట్టణ ముందంజ

**సూర్య, రాయికల్**

స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమంలో భాగంగా రాయికల్ పట్టణం ఓడిఎఫ్ ప్లస్ పట్టణంగా అప్ గ్రేడ్ పొందిందని రాయికల్ మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా రాయికల్ పట్టణంలో చెత్తాచెదారం సేకరణతో పాటు తడి పొడి చెత్త వేరు చేయుట, వ్యాపార వాణిజ్య, గృహ సముదాయాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టుట, పబ్లిక్ టాయిలెట్ల వినియోగం వంటి అంశాలలో విశిష్ట సేవలు అందించినందుకు గాను ఓడిఎఫ్ ప్లస్ పట్టణముగా అప్ గ్రేడ్ సాధించిందని కమిషనర్ తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023 కార్యక్రమం పోటీలలో భాగంగా జోనల్ లో రాయికల్ పట్టణం 14వ ర్యాంకు సాధించి అప్గ్రేడ్ పొందినదని, తద్వారా రాయికల్ పట్టణ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి కృషి చేసిన పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి మున్సిపల్ పాలకవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే వివేక్ ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

**సూర్య, హుజురాబాద్**



చెన్నూరు నియోజకవర్గం శాసనసభ్యులు, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గడ్డం వివేక్ వెంకటస్వామి ని గురువారం హైదరాబాద్ లో ఆయన నివాసంలో హుజురాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా హుజురాబాద్ పట్టణ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఆయనను కోరారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు ఉన్నారు.

## సాంప్రదాయ పంటలకు బదులుగా ఇతర పంటలు వేయాలి

**- ఏడిఏ సునీత**

**సూర్య, హుజురాబాద్**



రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో సాంప్రదాయ పంటలకు బదులుగా ఆయిల్ ఫామ్ లాంటి ఇతర పంటలు సాగు చేయాలని హుజురాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు గూండా సునీత అన్నారు. గురువారం హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇప్పలనర్సింగాపూర్ లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులు గూడూరి స్వామిరెడ్డి, గూడూరి మల్లారెడ్డి ల తోటలను ఆమె సందర్శించారు. ఆయిల్ ఫామ్ సాగులో రైతులు చేయవలసిన, చేయకూడదని విషయాలను రైతులతో పంచుకున్నారు. ఆయిల్ ఫామ్ పంటల సాగు కోసం ముందుకు రావడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈ సందర్భంగా సాగులో అనుసరించాల్సిన పలు సూచనలు తెలిపారు. అనంతరం వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పొద్దుటూరి సతీష్ రెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

**సూర్య వేములవాడ**



యువత అన్ని రంగాల్లో రాణించి తగిన గుర్తింపు పొందాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవ వేడుకల్లో భాగంగా నరేన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్రహారంలోని శ్రీ కన్వెన్షన్ లో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ ,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు వివేకానంద జయంతి శుభాకాంక్షలు తెలిపారు. వివేకానందస్వామి ని స్ఫూర్తితో యువత ముందుకు వెళ్ళాలి అని అన్నారు. వివేకానందడు యువతకు తన ప్రసంగాల ద్వారా ఎంతో స్ఫూర్తి నింపారని అన్నారు. విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో పరిశీలించారు. బాలానగర్ లో రేషన్ దుకాణం ప్రారంభించారు.

## కేరళ స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

**సూర్య, వీణవంక**



వీణవంక మండల కేంద్రంలోనీ కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలు వివిధ రకాల వేశాధారణలతో అలంకరణ చేసి, ముగ్గులు వేసిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.